J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




లాయర్

సంపుటి : 46 సంచిక : 10 7.8.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# రసవత్తరం.. స్థానిక సమరం

## త్వరలో ఎన్నికలు




- ఎస్ఈసీ భేటీలో కీలక నిర్ణయం
- సెప్టెంబర్‌లో నోటిఫికేషన్
- అక్టోబర్, నవంబర్‌లో ఎన్నికలు
- వ్యూహ ప్రతివ్యూహాల్లో ప్రధాన పార్టీలు

రెండేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు పోటీపడిన కూటమి పార్టీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి ముఖాముఖి సమరానికి సిద్ధమయ్యాయి. సార్వత్రిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన తెలుగు దేశం, జనసేన, బీజేపీ మరోసారి అదే సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఈ మేరకు కేడర్‌ను సమాయత్తం చేసేందుకు కార్యాచరణ కూడా ప్రారంభించాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం చవిచూసిన జగన్‌పార్టీ మొదట స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని భావించినా తాజాగా బరిలో దిగాలనే నిశ్చయించింది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ సైతం రాజకీయపార్టీలు, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీచేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం.

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులుకి ఇప్పటికే సూచించారు. ఈ నేపథ్యంలో ఈనెల 6న పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వార్డుల విభజన, వివిధ స్థానిక సంస్థల ఎన్నికలపై ఉన్న కోర్టుకేసుల ప్రస్తుత స్థితిగతులు, నిష్పాక్షిక పోలింగ్‌కు అవసరమైన ముందస్తు ఏర్పాట్లపై విస్తృతంగా సమీక్షించారు. అధికారులకు ఎన్నికల ప్రక్రియపై సరైన దిశా నిర్దేశం చేసి ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు దశల వారీగా నిర్వహించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మొదట మున్సిపల్ ఎన్నికలు పూర్తిచేయనున్నారు. తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించి పూర్తి చేసేలా ప్రతిపాదనలు రూపొందించారు. రాష్ట్రంలోని అన్నిరకాల స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్, నవంబర్ నెలల నాటికి పూర్తిగా ముగించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. పల్లెలు, పట్టణాల్లో పాలనను పరుగులు పెట్టించేందుకు స్థానిక పోరును త్వరిగత గతిన పూర్తిచేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రచించినట్లు తెలిసింది.

### సెప్టెంబర్ తొలివారంలో తుది ఓటర్ల జాబితా!

ప్రస్తుతం సర్ (ఎస్ఐఆర్) తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెప్టెంబర్ తొలి వారంలో విడుదల చేయనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో సర్ ద్వారా నిర్ధారించిన మొత్తం ఓటర్ల సంఖ్య చూస్తే 3,72,02,684

2లో



# రసవత్తరం.. స్థానిక సమరం

(మొదటిపేజీ తరువాయి)

మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1.82 కోట్లు, స్త్రీలు 1.89 కోట్ల మంది ఉన్నారు. మూడోవర్గం ఓటర్లు 2,736 మంది ఉన్నారు. ఇక 44.9 లక్షల మంది ఓటర్లు తాము గతంలో ఇచ్చిన చిరునామాల్లో కనబడడం లేదని తేల్చగా , 15.22 లక్షల మంది మరణించినట్లు గుర్తించారు. 14.43 లక్షల మంది శాశ్వత నివాసం మార్చడం, రెండుచోట్ల అంతకు మించి పేర్లు నమోదైనవారు 7.37 లక్షల మంది ఉన్నారు, ఈనేపథ్యంలో ఈనెల 31 వరకు సవరణలకు అవకాశం కల్పించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని అంశాలనూ పరిశీలించిన తర్వాత తుది ఓటర్ల జాబితాను విడుదల చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ తర్వాత స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ఇక గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియగా, పురపాలక సంఘాల పాలకవర్గ పదవీకాలం ఈ ఏడాది మార్చితో ముగిసింది. ఈనేపథ్యంలో ఎన్నికల సంఘం కొత్త పాలకవర్గాల ఏర్పాటు కోసం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈమేరకు స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనీల్‌చంద్ర పునేఠా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులతో భేటీ అయ్యి స్థానిక సమరానికి రంగాన్ని సిద్ధం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు తెలిసింది.

## కూటమి పార్టీల కార్యాచరణ!

ఇక 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు తీవ్ర అయోమయంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు ఎట్టకేలకు తమ అధిష్ఠానాలు ఆదేశించిన విధంగా జట్టు కట్టాయి. ఈ క్రమంలో ఘన విజయం సాధించి ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈనేపథ్యంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ హవా కొనసాగించాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేష్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు కొన్ని నెలల ముందే దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా మహానాడు సమయంలోనే పార్టీ కేడర్‌కు ఈమేరకు హింట్ ఇచ్చినట్లు తెలిసింది. తాజాగా జూలై 27 నుంచి నిర్వహిస్తున్న డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, ఆయా ప్రాంతాల ఇన్‌చార్జిలు 45 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ఫలాలను వివరించడం, ప్రభుత్వం తీసుకొన్న సంస్కరణలను తెలియజేయడం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత వైఎస్సార్ సీపీపాలలో జరిగిన విధ్వంసం వంటి అంశాలను పూర్తిస్థాయిలో వివరించాలని కూడా ఆదేశించారు.

ఇక జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలంటే స్థానిక ఎన్నికల కంటే మించిన గొప్ప అవకాశం మరొకటి ఉండదని భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆయన మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసి పార్టీ బలంగా ఉండే ప్రాంతాలు ఏవి?, స్థానిక నాయకత్వం బలంగా ఉండే డివిజన్లు, వార్డులు, పంచాయతీలు ఎక్కడెక్కడున్నాయి అనే విషయాలపై నివేదిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. అలాగే బలమైన నాయకులను పార్టీలోకి ఆహ్వానించే విషయంపై కూడా ఈ బృందం కసరత్తు చేస్తున్నట్లు వినికిడి. ఇక బీజేపీ కూడా స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు గాలివాటం కాదని, పార్టీకి క్షేత్రస్థాయిలో బలం ఉందని నిరూపించేలా పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు బావుట ఎగురవేయాలని తహతహలాడుతోంది. ఇందులో భాగంగానే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి కీలక సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారీగా నాయకులకు బాధ్యతలను అప్పగించారు. ఇందులో మంత్రి సత్యకుమార్, పార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఉన్నారు. వీరంతా ఇప్పటికే కార్యచరణ ప్రారంభించినట్లు తెలిసింది. ఇక ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీచేస్తే నాయకులు మరింత ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో బాధ్యత తీసుకుని పనిచేసే అవకాశం ఉంటుందని కూటమి పార్టీల అధిష్ఠానాలు భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిపై నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం నాయకుల నుంచి ఒత్తిడి పెరుగుతోందనే ప్రచారం కూడా సాగుతోంది.

## వైఎస్సార్‌సీపీ మొండిగా ముందుకు!

అసెంబ్లీ ఎన్నికల అనంతరం డీలాపడిన పార్టీ శ్రేణులను మళ్లీ పుంజుకునేలా చేయాలంటే స్థానిక ఎన్నికలే మార్గమని వైఎస్ జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. మొదట్లో కూటమి అరాచకాలకు కేడర్‌ను బలిచేయకూడదనే విషయంపై సాగిన సమావేశంలో స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని జగన్ భావించారని, అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేడర్ జవసత్వాలు కోల్పోకూడదంటే పోటీలో ఉండడమే సమంజసమని అనుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. స్థానిక ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల కళ్లకు కట్టే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకూడదని, ఎక్కడైనా ఏకగ్రీవం జరిగినట్లు తేలితే ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఫల్యంగానే భావిస్తానని జగన్ చెప్పడం కూడా పార్టీ నాయకులకు గట్టి సంకేతమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనా మొండిగా ముందుకెళ్లాలని, ఎక్కడా పట్టువిడుపు ధోరణులు ఉండకూడదని నాయకులకు గట్టి హెచ్చరికలు కూడా పంపినట్లు తెలిసింది. అయితే జగన్, ఆయన కోటరీ తీరుతో విసిగి వేసారిపోయిన నాయకులు ఎంత వరకు ముందుకొచ్చి పోరాడతారన్నది ఆసక్తికరంగా మారింది.

## రిజర్వేషన్ల ఖరారు తర్వాత!

“సర్” ప్రక్రియ ముగిసిన తర్వాత మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత ఎన్నికల నగారా మోగించి కొత్త పాలకవర్గాలకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మొదట 13,291 పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రచురించాలని, కోర్టు కేసులు ఉన్న 56 పంచాయతీల్లో ఆ తర్వాత విడుదల చేయాలని నిర్ణయించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రస్తుతం పునర్విభజన ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇందులో 13 నగరపాలక సంస్థలు, 87 మున్సిపాలిటీలు, 23 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో గతంలో 3,206 డివిజన్లు, వార్డులు ఉండగా వాటి సంఖ్య తాజాగా 3,927కి పెరగనున్నాయి. అంటే పునర్విభజన ప్రక్రియ తర్వాత కొత్తగా 736 డివిజన్లు, వార్డులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. నగర పాలక సంస్థలకు జిల్లా కలెక్టర్లను, మున్సిపాలిటీలకు ఆర్డీఓలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. పంచాయతీలకు మండలస్థాయి అధికారులని కేటాయించారు. ఈ నేపథ్యంలో ఎస్ఈసీ (స్టేట్ ఎలక్షన్ కమిషన్) వీలైనంత త్వరగా పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను నిర్వహించి వెంటనే కొత్త పాలకవర్గాలకు పాలనా బాధ్యతను అప్పగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

మరి పుర పోరు, ఊరి పోరో... ఎవరి పుట్టి ముంచుతుందో..? ఎవరిని అందలం ఎక్కిస్తుందో..? కాలమే నిర్ణయించనుంది..!

---

### కాలువల నిర్మాణాలు

# పటిష్టంగా ఉండాలి

**కమిషనర్ నందన్**



నెల్లూరు నగరంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ ఈనెల 5న పర్యవేక్షించారు. అందులో భాగంగా, స్థానిక విఘ్నేశ్వరపురం ప్రాంతంలో మురుగుకాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్దేశించిన సమయంలో డ్రెయిన్లను పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. కాలువల నిర్మాణాల్లో నాణ్యత ఉండాలని, మురుగునీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్‌కుమార్, ఏఇలు పాల్గొన్నారు.

### చెందోడు అంగన్‌వాడీ సెంటర్‌కి

# వాటర్‌క్యాన్లు

కోట మండలం చెందోడు అంగన్‌వాడీ సెంటర్‌కి ఎంవీ రావు ఫౌండేషన్ నిర్వాహకులు లీలామోహన్ కృష్ణ ఈనెల 4 వాటర్‌క్యాన్లు అందజేశారు. చిన్నారులకు సీజనల్ వ్యాధులు రాకుండా హోమియో మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు రూప, కోమలి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### అరసం ఆధ్వర్యంలో..

# కేంద్ర సాహిత్య అకాడమీ కార్యక్రమం

నెల్లూరు నగరంలో మొదటిసారి ఈనెల 6న కేంద్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'కవిసంధి' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ధనలక్ష్మీపురం వద్ద కలివెలపాలెంలో ఉన్న రెయిన్‌బో సీబీఎస్ఇ పాఠశాల సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. సాహిత్య పరమైన వారి సందేహాలకి అతిథులు సమాధానాలు తెలియజేశారు. ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ, ప్రముఖ రచయిత.. కేంద్ర సాహిత్య అకాడమీ కమిటీ సలహాసభ్యులు వల్లూరు శివప్రసాద్, పాఠశాల కరెస్పాండెంట్ పద్మా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షులు డా. గంగిశెట్టి శివకుమార్ వందన సమర్పణ చేశారు.

---

### 10న చెన్నైలో..

# ‘శంకరంబాడి సాహితీ వైభవం’

చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో, ‘జనని’ సాంఘిక సాంస్కృతిక సమితి సారథ్యంలో ఈనెల 10న శంకరంబాడి సుందరాచారి సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహించనున్నారు. శంకరంబాడి జయంతి సందర్భంగా మెరీనా ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించనున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి, జనని సంస్థ ప్రతినిధి డా. నిర్మలా పళనివేలు, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చిన్నయ్య ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఆచార్య ఎల్‌బి శంకరరావు ప్రధానోపన్యాసం చేస్తారు. ఈ సందర్భంగా ఉదయం 11.45 గంటలకు శంకరంబాడి వారు రచించిన ‘మా తెలుగుతల్లికీ మల్లెపూదండ’ పాటను వినిపిస్తారు. ప్రముఖ గాయని టంగుటూరి సూర్యకుమారి పాడిన ఆ పాట వీడియో ప్రదర్శనతో పాటు, ఆ పాట సినీ సన్నివేశాల ప్రదర్శన కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనేకమంది సాహితీవేత్తలు శంకరంబాడి సాహితీ వైభవాన్ని వివరిస్తారని, మధ్యాహ్నం 3.30 గంటలకు ముగింపు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

### సైబర్ నేరాల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి




విద్యార్థినులకి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహిళలు, విద్యార్థినులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ఈనెల 5న నెల్లూరు డీకేడబ్ల్యు కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో దర్గామిట్ట సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ బ్రహ్మయ్య, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కృష్ణారెడ్డి, శక్తి టీమ్ సభ్యులు పాల్గొని విద్యార్థినులకు సైబర్‌నేరాల పట్ల అవగాహన కలిగించారు. మహిళల రక్షణకు శక్తియాప్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు శక్తి యాప్‌ను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ గిరి, వైస్‌ప్రిన్సిపాల్ రమణారావు, మహిళా సాధికారత సెల్ కన్వీనర్ గీత, అధ్యాపకురాలు కళా ప్రియ తదితరులు పాల్గొన్నారు.

---

# తక్కువ ఖర్చుతో.. ‘జర్నలిజంలో డిప్లొమా కోర్సు’

అతి తక్కువ ఖర్చుతో “జర్నలిజంలో డిప్లొమా కోర్సు” చేసే మంచి అవకాశాన్ని సి.ఆర్. మీడియా అకాడమీ అందిస్తోందని ఛైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టులకోసం ఉద్దేశించినదైనా, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆప్రకటనలో ఆయన తెలిపారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులచే క్లాసులు నిర్వహిస్తామన్నారు. కోర్సు పూర్తి అవుతున్న సమయంలో ప్రతి అభ్యర్థి కోర్సు డైరక్టర్ ఆధ్వర్యంలో అస్సైన్‌మెంట్స్ రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులకు అస్సైన్మెంట్ మార్కులు కలిపి తుది ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెల్లడిస్తుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. ఇందుకోసం మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలు ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులో తమ వివరాలు నింపి ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్, అక్రిడిటేషన్ కార్డు లేదా ఐ.డి. కార్డు లేదా సర్వీసు ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీలను సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2000 డిమాండ్ డ్రాఫ్టును జతపరచి అప్లికేషన్‌లను పంపుకోవాలని ఆయన సూచించారు. జర్నలిజంపై అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులు దరఖాస్తుతో డిగ్రీ సర్టిఫికెట్, సెక్రెటరీ సి.ఆర్.మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2500 డిమాండ్ డ్రాఫ్టును జతపరచి పంపుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 20వతేదీలోగా సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ సి.ఆర్.మీడియా అకాడమీ, 40-6/4-8, 4వ అంతస్తు, రెవెన్యూకాలనీ, మొగల్రాజపురం, విజయవాడకి పంపాలని, సెప్టెంబర్ మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

# అశ్విని వైష్ణవ్‌ను కలిసిన..టీడీపీ ఎంపీలు




రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్‌తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార ప్రసార శాఖల మంత్రి అశ్వినివైష్ణవ్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా "Amaravati : Built by the People, Secured by Destiny" పేరుతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని కేంద్రమంత్రికి అంద జేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన చారిత్రక పరిణామాలు, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి, రాజధాని కోసం రైతులు, మహిళలు సాగించిన 1,631 రోజుల సుదీర్ఘ ఉద్యమం వగైరాలన్నీ ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, అమరావతి అనేది కేవలం ఒక రాజధాని నగరం మాత్రమే కాదని, కోట్లాది మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు, రైతుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. దేశంలో ప్రజల భాగస్వామ్యంతో నిర్మిత మవుతున్న విశిష్ట రాజధానిగా అమరావతి నిలుస్తోందన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితర ఎంపీలు పాల్గొన్నారు.



# స్వర్ణ భారత్ రజతోత్సవాలకి రండి

## యు.పి సీఎంకి దీపమ్మ ఆహ్వానం

నెల్లూరుజిల్లా వెంకటాచలంలో సెప్టెంబర్ మొదటి వారంలో స్వర్ణభారత్ ట్రస్టు రజతోత్సవ వేడుకలని ఘనంగా నిర్వహించడానికి ట్రస్టు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని ప్రధాన అతిథిగా పాల్గొనవలసిందిగా ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఆహ్వానించారు. ఆగస్టు 5వ తేదీ బుధవారం నాడు లక్నోలోని ముఖ్యమంత్రి నివాసంలో యోగి ఆదిత్యనాథ్‌ని దీపమ్మ తమ కుటుంబ సభ్యులతో కలిశారు. ఆమెతో పాటు దీపమ్మ కుమార్తె సుష్మ, కుమారుడు విష్ణు, కోడలు సాత్విక ఉన్నారు. స్వర్ణభారత్ రజతోత్సవాలలో పాల్గొనడానికి యోగి ఆదిత్యనాథ్ సూచన ప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం.

# దీక్ష చేస్తున్న విద్యార్థులకు..రామ్ సంఘీభావం



డీఎస్సీలో అక్రమాలపై నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయం సెంటర్లో ఈనెల 6వ తేదీ గురువారం నాడు వైయస్సార్సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షల్లో ఆయన పాల్గొని, విద్యార్థులకు, యువతకు తన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ అవకతవకలపై విచారణ చేసి, న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. టీడీపీ నేతలు గతంలో విద్యార్థు లకు, నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

# స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరులోని పలు స్కానింగ్ సెంటర్లలో వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పీసీపీ ఎన్డీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బ్రిజిత, డెమో అధికారి కనకరత్నం, డిప్యూటీ డెమో అధికారిణి సునీత తదితరులు ఆయా స్కానింగ్ సెంటర్లలోని రికార్డులతో పాటు, స్కానింగ్ యంత్రాలను, వైద్యుల సర్టిఫికెట్‌లను పరిశీలించారు. స్కానింగ్ చేయించుకునే ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్కానింగ్ సిబ్బందికి సూచించారు. లింగనిర్ధారణకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మహిళల భద్రత ముఖ్యం

## జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

జిల్లాలో మహిళల భద్రత ముఖ్యమని, చిన్నారుల రక్షణకు ప్రత్యేకచర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 5న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఆమె పోలీసు అధికారులతో సమావేశమై నేరసమీక్ష నిర్వహించారు. లైంగిక నేరస్తులపై సెక్సువల్ అఫెండర్స్ షీట్స్ ఓపెన్‌చేయాలని ఆదేశిం చారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని, వారికి మేలైన సేవలందించాలని మార్గ దర్శకం చేశారు. రాత్రి గస్తీలను ముమ్మరం చేసి నేరనియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డుభద్రత అంశాలపట్ల దృష్టిపెట్టాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనపరచిన సిబ్బందికి, అధికారులకు రివార్డులు అందజేశారు. ఏఎస్పీ సౌజన్య, ఏఆర్ ఏఎస్పీ అప్పారావు, డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, వివి రమణకుమార్, గిరిధర్, చంద్రమోహన్, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదవులకే వన్నెతెచ్చిన మహనీయుడు..డా.బెజవాడ గోపాలరెడ్డి

## జయంతి నాడు నివాళులర్పించిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కోటంరెడ్డి

## ఇకనుంచీ అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు



బెజవాడ గోపాలరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఎన్నో ఏళ్ళుగా నెరవేరని నెల్లూరీయుల కల.. ఇప్పటికి సాకారమైంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, నిష్కళంక మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ డా. బెజవాడ గోపాలరెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం అధికారి కంగా చేపట్టాలన్న ప్రజల కోరిక.. ఎట్టకే లకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతో నెరవేరింది.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కోటంరెడ్డి

డా. బెజవాడ గోపాలరెడ్డి 119వ జయంతి సందర్భంగా, నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న ఆయన విగ్ర హానికి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇక నుంచి డా. బెజవాడ గోపాలరెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వం తరపున అధికారికంగా జరుగుతాయని శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు.

### గొప్ప చరిత్ర కలిగిన మహానేత - కొనియాడిన సోమిరెడ్డి

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అంటే గొప్ప చరిత్ర కలిగిన మహానేత అని, ఆంధ్ర ప్రదేశ్‌కి ఆయనొక బ్రాండ్ అని, వారు నెల్లూరీయులు కావడం నెల్లూరుకే కాదు రాష్ట్రానికే గర్వకారణమని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. 1907లో బుచ్చిరెడ్డిపాళెంలో జన్మించిన డా. గోపాలరెడ్డి స్వాతంత్ర్యసమరంలో పాల్గొని జైలుశిక్షను కూడా అనుభవించారని ఆయన అన్నారు. ఆ తర్వాత నెహ్రూ, లాల్‌బహుదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీల మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారని, తన రాజకీయ జీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజకీయాల్లో ఇలాంటి నాయకులు మహా అరుదుగా ఉంటారన్నారు.

### జిల్లాకే గర్వకారణమైన నాయకుడు - కీర్తించిన కోటంరెడ్డి

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న నేత, కేంద్రమంత్రిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా డా.బెజవాడ గోపాలరెడ్డి చేసిన సేవలు అపూర్వమని, తన రాజకీయ జీవితంలో అనేక పదవులు పొంది, ఆ పదవులకే గౌరవం తెచ్చిన నాయకుడు డా. గోపాలరెడ్డి అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీర్తించారు. ఆ మహానేత జయంతి-వర్ధంతి కార్యక్రమాలు ఇకనుంచీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధికారికంగా నిర్వహిస్తుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# వైసీపీ ఆధ్వర్యంలో.. రిలే దీక్షలు



రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు నగర నియోజకవర్గంలో వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 6న రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు సిటీ నియోజక వర్గంలో ఈ దీక్షలు నిర్వహిస్తామని, మెగా డీఎస్సీ అక్రమాలపై మంత్రి నారా లోకేష్ రాజీనామా, సిబిఐ విచారణ కోరుతూ నిరసనలు తెలియజేస్తామని పర్వతరెడ్డి తెలిపారు. వైసీపీ నెల్లూరు నగర నియో జకవర్గ పరిశీలకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, వైసిపి రాష్ట్ర జిల్లా, నాయకులు, విద్యార్థి యువజన సంఘాల నేతలు విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో ఈ నిరసనల్లో పాల్గొంటున్నారు.

లాయర్
ఆగస్టు 07, 2026

# మగ్గాల్లోనే మగ్గిపోతున్న.. నేతన్నల బతుకులు!

చేనేత..ఒక అద్భుతమైన కళ. మన దేశ సంస్కృతికి నిలువెత్తు ప్రతీక. భారతీయ సంప్రదాయకళగా ప్రసిద్ధిచెంది.. తరతరాలుగా మనకు అందివస్తున్న ఒక అపూర్వమైన వారసత్వం. శ్రమైక జీవనసౌందర్యానికి ఇదొక నిలువుటద్దం. అది వృత్తిగతమైనా, వ్యక్తిగత నైపుణ్యానికి నిదర్శనం. అయినా.. సన్నని నూలుదారాలతో ఒక వస్త్రం నేయడమంటే.. చిన్న విషయమేమీ కాదు. ఎంతో శ్రమతో పాటు, నిపుణత ఉండాలి. మగ్గం గుంటలో గంటల తరబడి కూర్చుని కష్టపడితే తప్ప ఒక చీర తయారుకాదు. అందులోనూ నేతలో ఎంతో నైపుణ్యం ఉంటే తప్ప ఒక మంచి డిజైన్ రాదు. అటు శ్రమ-ఇటు నైపుణ్యం ఉంటే తప్ప, అనుకున్నస్థాయిలో వస్త్రాలు తయారుకావు. శారీరక, మానసిక శ్రమతో కూడుకున్న ఈ కళ అందరికీ వంటపట్టదు. ఒక్క నేతకారులకే ఇది సొంతం. మనదేశంలో తరాల తరబడి అదే వృత్తిగా జీవించే చేనేతకారులు, వారికి అనుబంధంగా పనిచేసే కార్మికులు కోట్లాదిగా ఉన్నారు. దేశ విదేశాల్లో చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంది కూడా. అయితే, అనాదిగా చేనేతకారుల జీవితాలు మగ్గం గుంటల్లోనే మగ్గిపోతున్నాయంటే అతిశయోక్తేమీ కాదు. ప్రభుత్వాల నుంచి ప్రజల నుంచి చేనేతకి తగినంత ఆదరణ ఉండడం లేదు. దేశంలో చేనేత రంగం ఆర్థికసంక్షోభంలో పడిపోవడంతో చేనేతకారులు జీవనోపాధి కోసం ఇతర వృత్తుల్లోకి వెళ్ళిపోతున్నారు. చేనేత వస్త్రాల తయారీకయ్యే ముడిసరుకుల ధరలు..ముఖ్యంగా నూలు ధరలు, రంగుల ధరలు, పట్టు-జరీ వంటి ముడిపదార్థాల ధరలు నానాటికీ పెరిగిపోతుండడం, పెరిగిన ధరలకు అనుగుణంగా నేతవస్త్రాలు ధరలు పెంచితే కొనేవారు లేకపోవడం, నేత వస్త్రాలకి గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటివి నేతన్నలకి పెద్ద శాపాలుగా పరిణమిస్తున్నాయి. అందుకు తోడు, మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా.. సంప్రదాయంగా ఉండే గుంట మగ్గాలతో.. మర మగ్గాలు పోటీపడుతుండడం వంటివి చేనేత రంగానికి పెద్ద సవాళ్లుగా ఉంటున్నాయి. మరోవైపు మిల్లు వస్త్రాల తయారీ ప్రారంభమయ్యాక చేనేతరంగం బాగా చితికిపోయింది. కుప్పలు తెప్పలుగా, అతితక్కువ ధరలకే వేలాది డిజైన్లతో లభించే మిల్లువస్త్రాల పట్ల వినియోగదారులు మొగ్గు చూపుతుండడంతో, నేతన్నలకి కష్టకాలం దాపురించినట్టయింది. సాధారణంగా పల్లెపట్టుల్లో వంశపారంపర్యంగా వస్తున్న చేనేతపైనే అధికశాతం మంది ఆధారపడుతుంటారు. వారికి, వారి కుటుంబాలకే కాక, వారికి సాయంగా పనిచేసే అనుబంధ కార్మికుల జీవితాలు కూడా వీరిపైనే ఆధారపడి ఉంటాయి. చిన్నతనం నుంచే అదేపనిగా చేనేతనే నమ్ముకుని, ఇతరత్రా పనులు చేయలేక, ఇప్పుడున్న సంక్షోభాన్ని తట్టుకోలేక ఎంతోమంది నేతకారులు బతుకుతెరువుకు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పెద్దగా చదువులు కానీ, చేతిలో ధనం కానీ వీరికి ఉండవు. నేతవస్త్రాలను విక్రయించే పెద్ద పెద్ద షాపుల వారి వద్ద వీరు అప్పులు తీసుకుంటూ ఉంటారు. ఆ అప్పులు సకాలంలో కట్టలేక వారు పడే బాధలు వర్ణనాతీతం. తాము నేసిన వస్త్రాలను నేరుగా వినియోగదారులకు విక్రయించే పరిస్థితులు చాలామందికి లేవు. మధ్యవర్తుల చేతిలో పెట్టి, వారిచ్చే స్వల్ప మొత్తాలతోనే జీవనం సాగిస్తుంటారు. నేటి ఆధునిక కాలంలో మిల్లు వస్త్రాల వారు సాంకేతికరంగంలో నిపుణులను పెట్టుకుని, ఆన్‌లైన్ వ్యాపారాలతో మార్కెట్లను ఆక్రమించేస్తుంటే, సాదాసీదా నేతకారుడు అలాంటి వ్యాపార మెళకువలేమీ చేతకాక, చివరికి ఏ దిక్కూ లేక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే చేనేతరంగం కుదేలైపోయింది. అగ్గిపెట్టెలో పట్టే చీరను కూడా నేసే అద్భుత కళా నైపుణ్యం భారతీయ నేతకారుల సొత్తు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కూడా మనదేశ నేతకారుల ప్రతిభా పాటవాలకి ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం చేనేతరంగంలో ఆనాటి స్ఫూర్తి ఇప్పుడు లేకపోవడమే బాధాకరం. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో నేతకారులకు ప్రభుత్వం 'నేతన్న నేస్త' వంటి పథకాలతో కొంతమేరకు అండగా ఉంటుండడం హర్షదాయకమే అయినా, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో చేనేతరంగం చతికిలపడిపోయింది. ప్రభుత్వాలు ఇకనైనా వారి దుస్థితిని గమనించి ముడిసరుకులపై సబ్సిడీలు పెంచడం, తక్కువ వడ్డీతోనే రుణాలిప్పించడం, చేనేత ఉత్పత్తులను విరివిగా ప్రోత్సహించడం వంటి చర్యలను వెంటనే చేపట్టాల్సి ఉంది. పేద నేతకారులకు ఇళ్ళస్థలాలు, పింఛన్లు వగైరాలన్నీ ఇచ్చి ఆదుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంతో పాటు, అన్ని రాష్ట్రాలూ అన్నివిధాలా చేయూతనందిస్తే తప్ప నేతన్నల బతుకులు బాగుపడవనడంలో సందేహం లేదు. అదేవిధంగా ప్రజలు కూడా చేనేత కళను గౌరవిస్తూ, వారి శ్రమని గుర్తిస్తూ.. నేత వస్త్రాలను విరివిగా కొనుగోలు చేస్తూ, చేనేతరంగానికి తమవంతు సహకారం అందించాల్సి ఉంది.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతంగా భోగాపురం విమానాశ్రయం



ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగంలోనే ఒక సంచలనాత్మకంగా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభం కావడం శుభపరిణామం. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మైలురాయిగా నిలవనుంది. ఇది కేవలం విమానాల రాకపోకలకు మాత్రమే పరిమితం కాకుండా, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు తెరవనుంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి రావడం వల్ల దేశీయ, విదేశీ పెట్టుబడులు ఆకర్షితమయ్యే అవకాశం కూడా ఉంది. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికవ్యవస్థ బలోపేతం కానుంది. అరకు, బొర్రా గుహలు, భీమిలి వంటి పర్యాటక ప్రాంతాలకు చేరుకోవడం ఇప్పుడు మరింత సులభమవుతుంది. అలాగే వ్యవసాయ, మత్స్య ఉత్పత్తులను వేగంగా మార్కెట్లకు తరలించే అవకాశం కలుగుతుంది.

అయితే, అభివృద్ధి పేరుతో రైతులు, మత్స్యకారులు, స్థానిక ప్రజల జీవనోపాధికి ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. స్థానికులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తే అభివృద్ధి ఫలాలు నిజంగా అర్హత కలిగిన ప్రజలకు చేరినట్లే. భోగాపురం విమానాశ్రయం కేవలం ఒక భారీ ప్రాజెక్టు మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చగల అభివృద్ధి కేంద్రంగా నిలిచే సామర్థ్యం దీనికి ఉంది. అయితే, ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే విమానాశ్రయంతో పాటు రహదారులు, రైల్వే అనుసంధానం, పారిశ్రామిక కారిడార్లు, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా అమలు చేయాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, స్థానిక ప్రజలు కలిసి పనిచేస్తే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రను దేశంలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఊతంగా అవతరిస్తుందనడంలో సందేహం అవసరం లేదు!

– యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# నత్తనడక నడుస్తున్న నెల్లూరు రైల్వే స్టేషన్ పనులు!

అధికారులు ఎంత వత్తిడి పెట్టినా, వీపీఆర్ లాంటి రాజకీయ నాయకులు ఎన్ని సమీక్షలు చేసినా నెల్లూరు రైల్వే స్టేషన్ పనులు మాత్రం నత్త నడక నడుస్తున్నాయి. 100 కోట్ల రూపాయలకిపైగా నిధులతో నెల్లూరు ప్రధాన స్టేషన్ ఆధునీకరణ చేపట్టిన కాంట్రాక్టర్‌కి అసలు చీమకుట్టినట్టైనా లేదు. అధికారుల వత్తిడిని, నేతల సమీక్షలని సదరు కాంట్రాక్టర్ లెక్క పెట్టడంలేదు. దున్నపోతు మీద వాన పడ్డట్లుగా ఆ కాంట్రాక్టరు వ్యవహరిస్తున్నాడు తప్ప పనులలో పురోగతి చూపడంలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు కదలడం లేదు. రైల్వే ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టిపెట్టి పాత కాంట్రాక్టర్‌ని పక్కనపెట్టి కొత్తవారికి పనులు అప్పజెప్తే తప్ప నెల్లూరు స్టేషన్ అభివృద్ధి పనులకి మోక్షం కలగదేమో.

కే.పి.రెడ్డి, బాలాజీనగర్.

# ప్రయోజనం లేని పరిశోధనలు వ్యర్థం



మన దేశంలో శాస్త్ర పరిశోధన అనగానే సాధారణంగా మన కళ్లముందు మెదిలేది ఏంటి? ఏదో ఒక పెద్ద ల్యాబ్‌లో పరిశోధన చేయడం, దానిమీద ఒక సుదీర్ఘమైన పేపర్ రాసి అంతర్జాతీయ జర్నల్‌కి పంపడం, అది ముద్రితమయ్యాక దానికి ఎన్ని 'సైటేషన్లు' వచ్చాయో లెక్కలేసుకుని సంబరపడటం. ఇన్నాళ్లూ ఒక డాక్టర్ గానీ, సైంటిస్ట్ గానీ ఎంత గొప్ప పరిశోధన చేశాడో సమాజానికి లేదా అకాడమిక్ ప్రపంచానికి చెప్పడానికి ఈ పరిశోధన పత్రాలే ఒక ప్రొఫెషనల్ విజిటింగ్ కార్డ్‌గా మారిపోయాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని మన వ్యవస్థలో 'పబ్లిష్ ఆర్ పెరిష్' అంటారు. అంటే ఏదో జర్నల్‌లో ప్రచురితమయ్యేలా చూసుకోకపోతే వెనకబడిపోవడమన్న మాట. కానీ, సూటూ బూటూ వేసుకుని, కోటు బొత్తాలు సర్దుకుంటూ విదేశీ జర్నల్స్‌లో వేసుకునే ఈ బొమ్మలు, వ్యాసాలు... ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి లేదా ఏదైనా పెద్ద ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే సామాన్యుడి జీవితాన్ని ఎంతవరకు మార్చాయంటే సరైన సమాధానం దొరకదు. ఇప్పటికిప్పుడు అవసరానికి తగిన ఆచరణాత్మక పరిశోధనలు కావలి. వారి మేధస్సును, శ్రమను తక్కువ చేయడం కాదు. ఆ పరిశోధనలు దీర్ఘకాలంలో ఎప్పుడో తగిన పరిస్థితులు ఉన్నప్పుడు ఉపయోగపడేవి. అయితే ఇటువంటి పద్ధతికి చరమగీతం పాడుతూ కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్' తీసుకొస్తున్న నూతన జాతీయ హెల్త్ రీసెర్చ్ పాలసీ ఒక రకంగా మన వైద్య రంగానికి కళ్లు తెరిపించే పరిణామం. ఇటీవలే ఈ పాలసీ ముసాయిదాను కేంద్ర ఆరోగ్యశాఖ ప్రజల ముందుకు తీసుకొచ్చింది.

ఈ కొత్త ముసాయిదా సారాంశం చాలా స్పష్టంగా ఉంది. మన దేశంలో జరిగే పరిశోధనలు ఏ లండనో, వాషింగ్టన్ జర్నల్‌లో ఉన్న పాఠకులను లేదా విదేశీ రివ్యూయర్లను మెప్పించడానికి జరగొద్దు; మన పల్లెల్లో, మన పట్టణాల్లో ప్రతిరోజూ ప్రజల్ని ఇబ్బందిపెడుతున్న స్థానిక రోగాలకు సరైన పరిష్కారం చూపడానికి జరగాలి. మన కళ్లముందే వేలాది మంది గ్రామీణ మహిళలను పీడిస్తున్న రక్తహీనత, టీబీ, డెంగ్యూ, ఫ్లోరోసిస్ లేదా కొన్ని నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలకే పరిమితమైన వింత జబ్బులను గాలికొదిలేసి... పాశ్చాత్య దేశాల శీతోష్ణస్థితులకు సంబంధించిన రోగాలపై ఇక్కడ ల్యాబ్‌లలో కూర్చుని పరిశోధనలు చేస్తే మన సమాజానికి ఒరిగేదేమిటి? అందుకే ఇకపై మన జాతీయ, ప్రాంతీయ 'వ్యాధుల తీవ్రత' ఎంత ఉందో, దానికి తగ్గట్టుగా ప్రాధాన్యతలను గుర్తించి రూపుదిద్దుకునే ప్రాజెక్ట్‌లకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రతిపాదించిన కొలమానం ప్రకారం చూస్తే ఏదైనా పరిశోధన వల్ల ప్రభుత్వ వైద్య విధానంలో ఏమైనా మార్పు వచ్చిందా? ఆసుపత్రుల్లో డాక్టర్లు రోగికి ఇచ్చే చికిత్సా పద్ధతి ఏమైనా సులువైందా? రోగి జేబు ఖర్చు తగ్గిందా? ఈ పరిశోధనలకు లోబడే మన దేశంలోనే ఏ మందో, లేదా కొత్త వైద్య ఉపకరణమో తయారయిందా? ఇవే ఇకపై ఒక పరిశోధకుడు లేదా పరిశోధన సంస్థ అసలు విజయాన్ని కొలిచే కొత్త ప్రమాణాలు. భారతదేశం లాంటి భారీ జనాభా, పరిమితమైన ఆర్థిక వనరులు ఉన్న దేశంలో సైన్స్ అనేది నాలుగు గోడల మధ్య కూర్చుని చేసుకునే మేధోమథనం కాకూడదు. ప్రజాధనంతో జరిగే ప్రతి పరిశోధన సామాజిక శ్రేయస్సుకు నేరుగా పనికొచ్చే ఒక ఆయుధం కావాలి. ఈ ఆలోచన కనుక నిజంగా ఆచరణలోకి వస్తే... మన దేశంలోనే అత్యంత చవకైన వెంటిలేటర్లు, పది నిమిషాల్లో రోగాన్ని కచ్చితంగా చెప్పే డయాగ్నొస్టిక్ కిట్లు, మన శరీర తత్వానికి తట్టుకునే నూతన మందులు రూపుదిద్దుకుంటాయి. విదేశాల నుంచి అత్యంత ఖరీదైన ధరకు దిగుమతి చేసుకునే మెడికల్ పరికరాల మీద మనం ఆధారపడటం తగ్గుతుంది. అంతేకాదు, ఇది మన దేశీయ మెడ్‌టెక్ స్టార్టప్‌లకు సరికొత్త ఊపిరి పోసి, మన రంగాన్ని స్వయంసమృద్ధి వైపు తీసుకెళ్తుంది.

అయితే, కాగితం మీద ఉన్న ఈ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకురావడం మాత్రం అంత తేలికైన విషయమేమీ కాదు. ల్యాప్‌టాప్ ముందు కూర్చుని ఒక రీసెర్చ్ పేపర్‌కి వచ్చిన సైటేషన్లను లేదా పాయింట్లను లెక్కపెట్టడం కంప్యూటర్‌కు చాలా తేలికైన పని. కానీ ఒక పరిశోధన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఒక నిరుపేద రోగి జీవితంలో ఎలాంటి గుణాత్మక మార్పు తెచ్చిందో నిష్పాక్షికంగా అంచనా మాత్రం కత్తిమీద సాము లాంటిది. దానికి పారదర్శకమైన, ఎటువంటి పక్షపాతం లేని మదింపు వ్యవస్థ ఉండాలి. దాంతోపాటు మన వైద్య కళాశాలలు కేవలం పుస్తకాలు చదివించి పరీక్షలు రాయించడం మానేసి, మొదటి ఏడాది నుంచే వైద్య విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశోధనను అలవాటు చేయాలి.

జర్నల్ పేజీల్లో ముద్రించే మెరిసే అక్షరాల కన్నా, ఆసుపత్రి బెడ్ మీద ఉన్న రోగి ముఖంలో కనిపించే ఉపశమనమే అసలైన పరిశోధనా విజయం. ఈ విధానం కేవలం ప్రభుత్వ ఫైళ్లకే పరిమితం కాకుండా నిజాయితీగా చేతల్లోకి వస్తే, కోట్లాది మంది సామాన్య భారతీయులకు నాణ్యమైన, చవకైన వైద్యం అందడం ఖాయం.

ప్రపంచానికి మన శక్తిని చాటడమంటే కేవలం ప్రచురణల సంఖ్యను పెంచుకుంటూ పోవడం కాదు, సమస్యలకు అత్యంత వేగంగా ఆచరణాత్మక పరిష్కారాలు చూపడమే. ప్రయోగశాలలోని శాస్త్రవేత్త ఆలోచన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యుడి ఆచరణ, ఆసుపత్రిలోని రోగి శ్రేయస్సు.. ఈ మూడూ ఒకే తాటిపైకి వచ్చినప్పుడే భారతీయ వైద్య రంగానికి అసలైన ఆత్మనిర్భరత లభిస్తుంది. కాబట్టి ప్రచురణల వెలుగుల కన్నా ప్రజానీకానికి దక్కే ఆరోగ్య వెలుగులే మన సైన్స్ పురోగతికి అసలైన కొలమానం కావాలి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

## ఉదయగిరి కోట
# పరిరక్షణ పనులు ఎప్పుడు?

### లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు జిల్లా ఉదయగిరిలోని చారిత్రక ఉదయగిరి కోట, రంగనాయకుల ఆలయ పరిరక్షణ పనుల పురోగతి, వాటి అమలుకు అవసరమైన నిధులు, పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈనెల 3న పార్లమెంట్‌లో లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. అందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానం ఇస్తూ, ఉదయగిరి కోటకు వెళ్లే మెట్ల పునరుద్ధరణ, అలాగే అక్కడి రంగనాయకుల ఆలయంలోని ప్రాచీన రాతి నేల పునరుద్ధరణ పనులను నేషనల్ కల్చర్ ఫండ్ (ఎన్‌సిఎఫ్) పరిధిలో గుర్తించిన వారసత్వ పరిరక్షణ ప్రాజెక్టుల్లో చేర్చినట్లు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా అమలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు నేషనల్ కల్చర్ ఫండ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు ప్రాజెక్టులకు ఏ సంస్థ సీఎస్ఆర్ నిధులు అందించేందుకు ముందుకు రాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. ఈ రెండు పనుల అమలుకు సుమారు రూ.7.25 కోట్ల అంచనా వ్యయం ఉంటుందని, తుది సాంకేతిక నివేదిక, ప్రాజెక్టు అవసరాలను బట్టి వ్యయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని కేంద్ర మంత్రి వివరించారు.

## ఇఎస్ఐ ఆస్పత్రి, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు పిలవండి!

### -- కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయను కోరిన.. విపిఆర్ --

జిల్లా కేంద్రమైన నెల్లూరులో 100 పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంతో పాటు సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 3న కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయను కోరారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు ఆయన న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. నెల్లూరులో 100 పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనువైన స్థలంతో పాటు, సిబ్బంది క్వార్టర్ల కోసం ఒక ఎకరం స్థలాన్ని ఇప్పటికే కేటాయించారని, సంబంధిత అధికారుల బృందం పరిశీలన పూర్తిచేసి ఆ స్థలాలు అనుకూలంగా ఉన్నట్లు ధ్రువీకరించారని తెలిపారు. ఈ ప్రాంతంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు, వారి కుటుంబాలకు ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. తమ వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని విపిఆర్ తెలిపారు.

## ఉత్సాహంగా ఐఐఐటీ-శ్రీసిటీ స్నాతకోత్సవం

### ■ 328 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం



శ్రీని రాజు సమక్షంలో సుచిత్ర ఎల్లాను సత్కరిస్తున్న ప్రొ. రమేష్ వెంకటేశ్వరన్, ప్రొ. మహాదేవ ప్రసన్న

శ్రీసిటీలోని జాతీయ విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) 10వ స్నాతకోత్సవం ఇటీవల ఉత్సాహంగా జరిగింది. ఇందులో 10మంది పీహెచ్‌డీ పరిశోధకులు, 318మంది బీటెక్ విద్యార్థులు కలిపి మొత్తం 328 మందికి సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.ఆర్.మహాదేవ ప్రసన్న డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత సుచిత్ర ఎల్లా ముఖ్యఅతిథిగా హాజరై స్నాతకోపన్యాసం చేశారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రమేష్ వెంకటేశ్వరన్ అధ్యక్షత వహించగా, శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, ఇతర గవర్నింగ్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ విద్యార్థులు విజయాన్ని మాత్రమే కొలమానంగా కాకుండా విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. ఆవిష్కరణలు, నైతిక విలువలు, బాధ్యతాయుత సాంకేతికత వినియోగం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డిల దూరదృష్టిని ఆమె కొనియాడుతూ, ప్రపంచస్థాయి పారిశ్రామిక వాతావరణం మధ్య ఏర్పాటైన ఐఐఐటీ-శ్రీసిటీ, విద్యార్థులకు అపూర్వ అవకాశాలను కల్పిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ బ్యాచ్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుంచి 248 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ నుంచి 70 మంది పట్టభద్రులు కావడం విశేషం. ఈ సందర్భంగా, అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన బిశ్వజీత్ సాహూ, వరుణ్ రాకేశ్‌లకు ముఖ్య అతిథుల చేతులమీదుగా స్వర్ణ పతకాలు ప్రదానం చేశారు. ప్రొఫెసర్ రమేష్ వెంకటేశ్వరన్, ప్రొఫెసర్ మహాదేవ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పనులు చేస్తున్నాం కాబట్టే...
# ప్రజల్లోకి ధైర్యంగా వెళుతున్నాం

### ● మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ప్రజలకి అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు అవసరమైన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ముమ్మరంగా అమలుచేస్తున్నాం కాబట్టే తాము ప్రజల్లోకి ధైర్యంగా వెళుతున్నామని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. వెంకటాచలం మండలం కనుపూరులో ఆయన ఇటీవల 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పుడు ఊహించని స్థాయిలో అభివృద్ధి, సంక్షేమం పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశీస్సులు, సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల పట్టుదల, కృషితో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరుతోందని, ముగ్గురు, నలుగురు, ఐదుగురు బిడ్డలున్న వాళ్లు కూడా లబ్ధి పొందుతున్నారని ఆయన అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ దేశంలోనే నంబర్1గా నిలిచి చరిత్ర సృష్టిస్తోందని, దీపం పథకంలో భాగంగా మహిళలు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుకుంటున్నారని, స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగిస్తున్నారని ఆయన ప్రజలకి తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పడకేసిందని, కీలక శాఖలన్నిటినీ మూసేశారని, కోట్లాదిరూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. నుడా నిధులు రూ.27 కోట్లను డ్రైన్ల పేరుతో బురదలో కలిపేశారని, జగనన్న కాలనీల పేరుతో దోపిడీకి పాల్పడ్డారని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక నోరు పారేసుకునే వ్యక్తిని వాళ్ల సొంతపార్టీ నేతలే ఈసడించుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న పనులను చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, దేగపూడి- బండేపల్లి కాలువను కూడా వీలైనంత త్వరలో పూర్తిచేసే ప్రయత్నంలో ఉన్నామని ఆయన వివరించారు.

## రాష్ట్రంలో పెరుగుతున్న
# కరోనా కేసులు

రాష్ట్రంలో కరోనా కేసులు క్రమేణా పెరుగుతున్నాయి. గత నెల 24 నుంచి కరోనా కేసులు ఒకటొకటిగా వస్తూనే ఉన్నాయి. ఈనెల 1న విశాఖ, విజయనగరం జిల్లాల్లోనూ ఒక్కొక్క కేసు నమోదైంది. మొత్తంగా 5575 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా, ఆగస్టు 1 నాటికి 61 పాజిటివ్ కేసులు ఉన్నట్లు తేలింది. కరోనా పాజిటివ్ వచ్చినవారిలో ఇప్పటికే నలుగురు మృతిచెందగా, 29 మంది డిశ్చార్జ్ అయ్యారు. మరో 8 మంది ఆసుపత్రులలోను, 20 మంది ఇళ్ళ వద్ద కోలుకుంటున్నారని సమాచారం.

## నూరురోజులు సేవలో.. 'నారాయణ ఆన్ వీల్స్'




కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నారాయణ ఆన్‌వీల్స్ వైద్య సిబ్బంది

నెల్లూరు నగరంలో పేద ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సొంత నిధులు దాదాపు 3 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ప్రారంభించిన 'నారాయణ ఆన్ వీల్స్' వాహనం ద్వారా 'నేత్ర జ్యోతి మరియు దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాలు ఈనెల 3వ తేదీ నాటికి విజయవంతంగా 100వ రోజుకు చేరుకున్నాయి. నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే ఉచిత వైద్యసేవలు అందిస్తుండడంతో ఎంతోమంది దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం 54 డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో నారాయణ నేత్ర జ్యోతి-దంత సురక్ష వందరోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు.. ముందుగా స్థానిక నాయకులు, వైద్యులు 100 రోజులకు సంబంధించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. క్లస్టర్ ఇంచార్జ్ జహీర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు నేత్రజ్యోతి ద్వారా 11,000 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 6,500మందికి ఉచిత కళ్లద్దాలు, 200 మందికి పైగా ఉచిత శస్త్రచికిత్సలు పూర్తిచేశారని తెలిపారు. అదేవిధంగా దంత సురక్ష ద్వారా 6,500 మందికి పరీక్షలు చేసి, 2,500 మందికి పలు ఆసుపత్రుల్లోను, నారాయణ ఆన్ వీల్స్ క్లినిక్ ద్వారా ఉచిత చికిత్సలు అందించారని పేర్కొన్నారు.

# వసతులు లేక అవస్థలు

### దుస్థితిలో శివారు ప్రాంతాలు



నెల్లూరు నగరం బాగా విస్తరిస్తుండడంతో వేలాదిమంది ప్రజలు శివారు ప్రాంతాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో నెల్లూరు చుట్టుపక్కలంతా కాలనీలు వెలుస్తున్నాయి. 54 డివిజన్లతో నగర జనాభాయే సుమారు 10 లక్షలు దాటింది. లక్షా 50వేలకి పైగానే ఇళ్లున్నట్లు అంచనా. దానికి తోడు, సరైన పనులు లేక జీవనభృతి కోసం పల్లె ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు అనేకమంది నగరంలో నివాసం ఉండడానికి ఇష్టపడుతున్నారు. ఎంతోకొంత డబ్బున్నవారు ఇళ్లు కట్టుకునేందుకు సిద్ధపడుతున్నారు. పేదలు ఎక్కడైనా కాస్తంత చోటు దొరికితే చాలన్నట్లు శివారు ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కానీ, వాటిలో కనీస వసతులు ఉండడం లేదు. ఎక్కడ చూసినా ముళ్లచెట్లు, డొంకరోడ్లతో ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నవానొచ్చినా మురుగునీళ్లు చేరిపోతున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో ఆ ప్రాంతాలన్నీ గబ్బు కొట్టిపోతున్నాయి. మట్టిరోడ్లు సరిగా లేకపోవడంతో, గుంతల రోడ్లలో ఎక్కడ పడిపోతామోనని వాహనదారులు భయపడుతున్నారు. రాత్రివేళల్లో ఇక్కడికి రావాలంటేనే భయంగా ఉంటోందని శివారుప్రాంతాల వాసులు చెప్తున్నారు. తాగేందుకు నీటి సదుపాయాలు, మురుగు కాలువల నిర్మాణాలు కూడా లేవు. ఇళ్ళ చుట్టూతా మురుగునీటి కాలువలు, దుర్గంధం, వాటికితోడు ఈగలు దోమలు పుట్టలుపుట్టలుగా వస్తున్నాయి. విషసర్పాలు కూడా అక్కడక్కడా కనిపిస్తున్నాయి. విద్యుద్దీపాలు నామమాత్రంగానే ఉంటున్నాయి. చీకటిపడితే చాలు, అంతా అంధకారంగానే ఉంటోంది. ప్రభుత్వాధికారులు, పాలకులు నగరం చుట్టుపక్కలా ఉన్న శివారు ప్రాంతాల దుస్థితిని గమనించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది.

## ఉత్తమ విద్యార్థులకు..

## పూర్వవిద్యార్థుల ప్రోత్సాహకాలు

నెల్లూరు నగరంలో బీవీఎస్ మునిసిపల్ హైస్కూలులో చదువు కుంటూ ఇటీవల 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించినవారికి ఆ స్కూల్ పూర్వవిద్యార్థులు (1988-89 బ్యాచ్) నగదు పుర స్కారాలను బహూకరించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 10వేలు, 5వేలు, 3వేల రూపాయల వంతున ఇచ్చారు. ఈ నెల 1న స్కూల్‌లో జరిగిన కార్యక్ర మంలో నగర మేయర్ సుజాత ఆధ్వర్యంలో బాలికలకు ఆ ప్రోత్సా హకాలను అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో..

## సంకటహర చతుర్థి!

సంకటహర చతుర్థి సంద ర్భంగా జిల్లాలోని గణపతి ఆల యాలు, శివాలయాల్లో ఈనెల 2న భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వ రాలయంలో ఉన్న ఆపత్ సహాయ వినాయకస్వామిని భక్తులు దర్శించు కుని పూజలు చేశారు. ఈ సంద ర్భంగా గణపతిని మందారమాల లతో శోభాయమానంగా అలంక రించారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా విజయకుమార్‌రెడ్డి, కార్యనిర్వహ ణాధికారి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## ధనలక్ష్మీపురంలో

## రక్తదాన శిబిరం

నెల్లూరులోని ధనలక్ష్మీపురంలో ఈనెల 2న మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధి కారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని రక్తదానం చేస్తున్న యువతను అభినందించారు. రక్త దానం ద్వారా బాధితుల ప్రాణా లను కాపాడవచ్చున్నారు. టీడీపీ నాయకులు చక్రవర్తిరెడ్డి, సమంత్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు విజయ భాస్కర్, సభ్యులు వినయ్, మస్తా నయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, కిరణ్ తదితరులు పర్యవేక్షించారు.

## పేద గిరిజనులకు

## సాయం చేయాలి

నెల్లూరులోని వైకుంఠపురంలో ఉన్న నిరుపేద గిరిజనులకు ఆధార్ కార్డులు కూడా లేవని, వారికి వాటిని సమకూర్చి, వారి అభ్యు న్నతికి ప్రభుత్వ పథకాలను అంద జేయాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు కోరారు. ఈనెల 11న సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన 'సామాజిక శంఖారావం' కార్యక్ర మంలో ఆయన పాల్గొని, ఇక్కడి గిరిజనుసకాలనీలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవని, జిల్లా కలెక్టర్ స్పందించి పేద గిరి జనుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం, ఐద్వా, ప్రజా నాట్యమండలి నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## పేదలకు ఉదారంగా ప్రభుత్వ సాయం

### ఎమ్మెల్యే కోటంరెడ్డి



సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల 54 మంది బాధితులకు 47 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారు. తమ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో 697 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.6 కోట్ల రూపాయల సాయం అందించడం సంతోషంగా ఉంద న్నారు. పేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం ఉదారంగా సాయం అందిం చడం విశేషమని ఆయన అంటూ, ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా పేదల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆర్థికసాయం మం జూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పాలిటెక్నిక్‌లో వసతులు అధ్వాన్నం

### ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల అస్తవ్యస్తంగా తయారైందని, కళాశాల పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయని, విద్యార్థులకు సరైన వసతులు లేవని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 4న ఆయన పాలిటెక్నిక్‌లో జరిగిన విద్యార్థుల ఆందోళనలో పాల్గొని మాట్లాడుతూ, ఈ కళాశాల చివరికి ఆకతాయిలకు నిలయంగా మారిందని విమర్శించారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథులు లేకపోవడం విచారకరమన్నారు.

## సాయిదర్బార్‌లో కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న మాడరన్ ఐ హాస్పిటల్ వైద్యులు

నెల్లూరు బాలాజీనగర్ శివారులోని పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీ సాయిబాబా అద్దాల మందిరంలో ఇటీవల గురుపూర్ణిమ మహోత్సవాలు వేడుకగా జరిగాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 2న శ్రీసాయి మాత నిత్య అన్నప్రసాదాలయం ద్వారకామాయిలో నెల్లూరులోని ప్రముఖ డాక్టర్ పి.ఎల్.రావు మాడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ వైద్య బృందం వారి సౌజన్యంతో మెగా ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. సుమారు 3వందల మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీచేశారు. వీరిలో 36మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. డాక్టర్ ఓ.రేవణారెడ్డి, డాక్టర్ హేమలత, సీఈఓ రామసుబ్బారావు, పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని మందిర ఛైర్మెన్ మధు సాయి పర్యవేక్షించారు. యువ సేవాదళ్ సభ్యులు, మందిరం గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

## రోడ్డుపక్కనే మంత్రి టిఫిన్



రోడ్డుపక్కన దుకాణంలో టిఫిన్ తింటున్న మంత్రి నారాయణ, కమిషనర్ నందన్

నెల్లూరు 9వ డివిజన్ నవాబుపేట శివాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన బంగ్లాతోట పార్క్, అత్యాధునిక మినీ ఫంక్షన్ హాల్‌లకు మంత్రి నారాయణ ప్రారంభోత్సవాలు చేశారు.ఆ తర్వాత అధికారిక హంగామాను పక్కనపెట్టి, నేరుగా నవాబుపేట వీధుల్లోకి వచ్చి, కాన్వాయ్‌ను వదిలేసి వీధుల్లో నడుచుకుంటూ వెళ్తూ, రోడ్డు పక్కన ఉండే చిరు వ్యాపారుల వద్ద ఆగి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఒక చిన్న టిఫిన్ సెంటర్‌లో సాధారణ పౌరుడిలా కూర్చుని ఉపాహారం తిని, టీ కొట్టు వద్ద నిలబడి స్థానిక నాయకులతో కలిసి చాయ్ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇలా నేరుగా జనంతో మమేకమై ఆత్మీయంగా మాట్లాడుతున్న మంత్రి నారాయణను స్థానిక ప్రజలు సాదరంగా స్వాగతించారు. మంత్రితో పాటు కమిషనర్ నందన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు గునుకుల కిషోర్ దంపతులు

కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమపాలన అందిస్తోందని జనసేన నాయకుడు గునుకుల కిషోర్ తెలిపారు. ఈనెల 4న ఆయన నెల్లూరులోని 16వ డివిజన్‌లో ప్రభుత్వం చేపట్టిన 'అభివృద్ధి అడుగులు-సంక్షేమ వెలుగులు' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. జనసేన నాయకులు ప్రశాంత్‌గౌడ్, కార్తీక్, నాయకురాళ్ళు విజయలక్ష్మి, ప్రవల్లిక పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవాసంఘాల సమాఖ్య..

## కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

జిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 2న నెల్లూరులోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. సమాఖ్య అధ్యక్షునిగా గుడ్లదొన వాసుదేవరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా వేదగిరి ఫణిశర్మ, ప్రధాన కార్యదర్శిగా దుద్దుకూరు రమేష్, కోశాధికారిగా రామాయణం మణిశంకర్, గౌరవ సలహాదారుగా రామయణం మహేశ్‌శర్మ, యువజన విభాగం కన్వీ నర్‌గా విష్ణుకుమార్, లీగల్‌సెల్ కన్వీనర్‌గా కెవెల్ నారాయణ, వర ప్రసాద్‌లతో పాటు జిల్లా సంఘం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

## 'వెంటాడిన పగ'..నవల ఆవిష్కరణ

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి సందడి అరుణ రచించిన 'వెంటాడిన పగ' నవల ఆవిష్కరణ ఈనెల2న నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. నెల్లూరుజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ప్రముఖ కవి.. చిన్ని నారాయణరావు తదితరులు ఆవిష్కరించగా, ప్రముఖ కవి వేదం సూర్యప్రకాష్ సమీక్షిం చారు. అడుగడుగునా సస్పెన్స్‌తో సాగే ఈ నవల పాఠకులను బాగా ఆకట్టుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. నెరసం అధ్యక్షులు జయ ప్రకాష్ సభకు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్, కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొని రచయిత్రి అరుణను అభినందించి సన్మానించారు.

## ఆర్టీసీ ఇడిగా.. జగదీష్

ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ (ఇ.డి)గా తిరుపతి ప్రజారవాణా అధికారి ఎం.జగ దీష్ నియమితులయ్యారు. ఈ స్థానంలో పనిచేస్తున్న నాగేంద్ర ప్రసాద్ ఉద్యోగ విరమణ చేయ డంతో ఆయనను నియమించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన జగదీష్‌ని జిల్లా ప్రజారవాణా అధి కారి షమీమ్, ఉద్యోగులు స్వాగ తించి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్‌శాఖ సాంకేతిక

## ఇంజనీర్‌గా..అల్తాఫ్

నెల్లూరు నగరానికి విద్యుత్ శాఖ సాంకేతిక విభాగంలో ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్‌గా కర్నూలు జిల్లాలో విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న అల్తాఫ్‌ని విద్యుత్‌సంస్థ నియమించింది. ఇటీవల ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. కొత్త ఇతని విద్యుత్‌భవన్ ఉద్యోగులు, ట్రేడ్‌యూనియన్ల నాయకులు ఈనెల 1న ఆయన కార్యాలయంలో సన్మా నించారు. అనంతరం విద్యుత్ ఎస్ఇ రాఘవేంద్రంను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

## గాంధీనగర్ పాఠశాలకి..

## సీలింగ్ ఫ్యాన్ల వితరణ

నెల్లూరులోని గాంధీనగర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు ఈనెల 1న ఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం సేవాసమితి ఆధ్వర్యంలో నాలుగు సీలింగ్‌ఫ్యాన్లు వితరణగా అందజేశారు. కాకినాడకి చెందిన మహతి సంగీత కళానిలయం నిర్వాహకురాలు మహతి సహకా రంతో వాటిని అందజేసినట్లు సేవాసమితి అధ్యక్షుడు కె.వై దయ తెలిపారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు

నెల్లూరు నగరంలోని నవలా కులతోటలో ఉన్న సరస్వతి శిశు మందిర్, శ్రీ సరస్వతి విద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 1న పలు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వ హించారు. స్థానిక వివేకానంద హైస్కూలులో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమ తులు అందజేశారు. ముఖ్యఅతిథు లుగా నందకిషోర్, సూర్యప్రకాష్, తిరువీధి హరినారాయణ పాల్గొన్నారు.

## ముమ్మరంగా

## పోలీసుల తనిఖీలు

శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణలో భాగంగా పోలీ సులు జిల్లా ఎస్పీ అజిత వేజండ్ల సూచనల మేరకు ఇటీవల రెండు రోజులపాటు జిల్లావ్యాప్తంగా నాకా బందీ తనిఖీలు నిర్వహించారు.పలు లాడ్జీలను, రహదారుల్లో వెళ్తున్న వాహనాలను తనిఖీచేశారు. మద్యం సేవిస్తూ వాహనాలు నడిపేవారిపై 12 కేసులు, వాహనాలకు సరైన పత్రాలు లేనివాటిపై 252 కేసులు పెట్టి, రూ.1,18, 610 అపరాధ రుసుంగా వసూలు చేశారు.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం

## • మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకువెళ్తూ, ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి వారితో ఆత్మీయంగా మాట్లాడుతూ, సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు, విద్యార్థులతో సహపంక్తి భోజనం, 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమ విజయోత్సవ సభ' తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. అనంతరం, మర్రిపాడులో రూ.3.95 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఎస్సీ కాలనీలో రూ.61.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 64 సోలార్ ప్యానెల్ యూనిట్లను ప్రారంభించారు. రూ.55 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు. రూ.2.54కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల భవనం, ఆధునిక ల్యాబ్‌లను ప్రారంభించారు. మర్రిపాడులో జరుగుతున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మంత్రి గర్భిణులను ఆశీర్వదించి సారె అందజేశారు. అనంతరం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొని మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

# మంత్రి నారాయణ.. సుడిగాలి పర్యటన

## • ఇంటింటికీ తిరిగి పింఛన్లు ఇచ్చిన మంత్రి



పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ ఇటీవల సుడిగాలి పర్యటన చేశారు. 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొని, ఆ వెనువెంటనే ఆయన నెల్లూరుకు వచ్చి పింఛన్లు అందజేయడమే కాక, అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వారికి సక్రమంగా అందుతున్నదా అని ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలలో 62.07 లక్షలమందికి రూ.2,712.84కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

### పార్కులకు కొత్త అందాలు

నెల్లూరు నగర నియోజకవర్గంలో రూ.39 లక్షలతో ఆధునీకరించిన బంగ్లాతోట పార్క్, ఏసీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి నారాయణ ప్రారంభించారు. 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా కేక్ కట్ చేసి, పిల్లలతో కొంతసేపు సరదాగా ఆడుకుంటూ గడిపారు. ఈ సందర్భంగా మంత్రి స్థానికులతో మాట్లాడుతూ, గత పాలకులు పార్కులను నిర్వీర్యం చేస్తే, తమ ప్రభుత్వంలో నెల్లూరులో 47 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టి ఇప్పటికే 40 పార్కులను ప్రారంభించామన్నారు. తక్కువ ఖర్చుతో పిల్లల పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు ఏసీ కమ్యూనిటీ హాల్స్ ఉపయోగపడతాయని చెప్పారు.

### చండీహోమంలో..

నెల్లూరు నగరంలోని జగదీష్‌నగర్‌లో ఇటీవల వైభవంగా నిర్వహించిన మహారుద్రాభిషేకం, చండీ హోమం, లలితా సహస్రనామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..చండీహోమం కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ అదృష్టంగా భావిస్తున్నానని, వరుసగా 18వ సంవత్సరం ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్న భువనగిరి సుబ్బయ్యస్వామికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏక కాలంలో 1108 మంది మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేయడం అరుదైన ఆధ్యాత్మిక ఘట్టమని, రాష్ట్రం అన్ని రంగాల్లో వర్ధిల్లాలని ప్రార్థించారు.

# చెస్ ఛాంపియన్‌షిప్‌లో.. 'రెయిన్‌బో'కి కాంస్య పతకం



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ పద్మ సుబ్రహ్మణ్యం

సీబీఎస్ఈ సౌత్ జోన్–1 అండర్–14 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో నెల్లూరులోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభతో కాంస్య పతకాన్ని (మూడో స్థానం) సాధించారు. ఇటీవల విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి. తమిళనాడు, పుదుచ్చేరి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అండమాన్ మరియు నికోబార్ దీవుల నుంచి పాల్గొన్న ప్రతిష్ఠాత్మక జట్ల మధ్య రెయిన్‌బో పాఠశాల అండర్–14 బాలికల జట్టు సమన్వయం, పట్టుదలతో ఆడి మూడో స్థానాన్ని సాధించింది. ఈ జట్టులో బి.కీర్తన, వి.జాన్య సాయి శరణ్య, పి.జెనిషా, వి.దివిషారెడ్డి ఉన్నారు. అయిదు మ్యాచ్‌లలో నాలుగు మ్యాచ్‌లు గెలిచి జట్టు ఈ విజయాన్ని అందుకుంది. ఈ ఘన విజయానికి గుర్తింపుగా జట్టుకు మెమెన్ ట్రోఫీతో పాటు కాంస్య పతకాలు ప్రదానం చేశారు. సీబీఎస్ఈ విజయవాడ ప్రాంతీయ అధికారి రమేష్ పి.మెనన్, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ జట్టుకు ట్రోఫీని, పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రెయిన్‌బో పాఠశాల డైరెక్టర్ పద్మ సుబ్రహ్మణ్యం, సీఈవో విశ్వాస్, ప్రిన్సిపాల్స్ అని గోప కుమార్, అరుణ స్వయంప్రభ మరియు ఉపాధ్యాయులు విజేతలైన విద్యార్థినులను అభినందించారు. వారి కృషి, క్రమశిక్షణ, అంకిత భావం పాఠశాలకు మంచి కీర్తిని తీసుకువచ్చాయని ప్రశంసించారు. ఈ విజయం భవిష్యత్తులో మరెన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలకు నాంది కావాలని ఆకాంక్షించారు.

# వేమిరెడ్డి దంపతులతో.. ఇఫ్కో ప్రతినిధుల భేటీ

## కిసాన్ సెజ్‌లో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలపై చర్చ



ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రతినిధులకి జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులను నెల్లూరులోని వారి నివాసంలో ఇటీవల ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) కిసాన్ సెజ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇఫ్కో కిసాన్ సెజ్ ఛైర్మన్ దిలీప్ సంఘాని, మేనేజింగ్ డైరెక్టర్ కేజే పటేల్ పాల్గొని కిసాన్ సెజ్ పరిధిలో పారిశ్రామిక అభివృద్ధి, కొత్తగా పెట్టుబడులను ఆకర్షించడం, నెల్లూరుజిల్లా యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై చర్చించారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో త్వరలోనే భారీ పరిశ్రమలు ప్రారంభం కాబోతుండటంతో, ఈ పరిశ్రమల్లో స్థానిక యువతకే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వేమిరెడ్డి దంపతులు వారికి తెలిపారు. పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా స్థానిక యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు వీపీఆర్ ఫౌండేషన్ తరపున త్వరలోనే ఒక 'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్' ప్రారంభించబోతున్నట్లు కూడా వెల్లడించారు. ఈ సెంటర్ ద్వారా యువతకు అవసరమైన ప్రత్యేక సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణను ఉచితంగా అందించి, పరిశ్రమలలో ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దుతామని వారు తెలియజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఇఫ్కో సీఈఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత, ఇఫ్కో ప్రతినిధులకు వేమిరెడ్డి దంపతులు జ్ఞాపిక అందజేసి, శాలువా కప్పి సత్కరించారు.

# విజయవంతంగా 'సూపర్ సిక్స్' పథకాలు



అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, ముఖ్యంగా 'సూపర్ సిక్స్' పథకాలను కూడా విజయవంతంగా చేపడుతున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. 'రెండేళ్ళ నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆయన ఈనెల 3న 17వ డివిజన్ వడ్డిపాలెంలో ఇంటింటికీ తిరిగి ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధి–సంక్షేమ పథకాల వివరాల కరపత్రాలను అందరికీ పంచారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ, కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ప్రజలకు వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం మేలు చేస్తోందని తెలిపారు. క్లస్టర్ ఇన్‌చార్జి సాబిర్‌ఖాన్, డివిజన్ అధ్యక్షులు ఊటుకూరు దత్తాత్రేయ పాల్గొన్నారు.




# విద్యార్థుల భవిష్యత్‌కు మార్గాలు : ఇంటర్న్‌షిప్‌లు.. సేవా కార్యక్రమాలు!

విద్యార్థి జీవితంలో 'అనుభవం' అనే పదం ఎంత విలువైనదో, అది ఉద్యోగ ప్రపంచంలో అడుగుపెట్టే సమయంలో మరింత స్పష్టమవుతుంది. పాఠ్యపుస్తకాలు జ్ఞానం ఇస్తాయి, కానీ అనుభవం దానికి జీవం పోస్తుంది. అందుకే ఇంటర్న్‌షిప్‌లు మరియు సేవా కార్యక్రమాలు(Volunteering) విద్యార్థుల భవిష్యత్‌ను నిర్మించే రెండు బలమైన స్తంభాలు. 'చేసిన పని మాత్రమే మనకు నిజమైన బలం" అనే సూక్తి విద్యార్థి జీవితానికి అచ్చం సరిపోతుంది. భారతదేశంలో చదువుతున్న విద్యార్థులకైనా, విదేశాల్లో చదవాలని ఆశపడుతున్నవారికైనా ఈ రెండు మార్గాలు భవిష్యత్‌ను మార్చగలవు. ఇంటర్న్‌షిప్ అంటే విద్యను అనుభవంతో కలిపే వంతెన. ఇంటర్న్‌షిప్ అనేది కేవలం ఒక పని అనుభవం కాదు; అది విద్యార్థి తన ఆసక్తి రంగాన్ని నిజ జీవితంలో ఎలా పనిచేస్తుందో చూసే అవకాశం. భారతదేశంలో చాలామంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లను చివరి సంవత్సరంలో మాత్రమే ఆలోచిస్తారు. కానీ ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో, విద్యార్థులు 9వ తరగతి నుంచే చిన్న చిన్న ఇంటర్న్‌షిప్‌లు చేస్తూ తమ ప్రొఫైల్‌ను నిర్మించుకుంటారు. భారత దేశంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు గత దశాబ్దంలో విపరీతంగా పెరిగాయి. టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, బయోటెక్నాలజీ, మీడియా, డిజైన్, సోషల్ సెక్టార్..ప్రతిరంగంలో విద్యార్థులకు అవకాశాలుఉన్నాయి. పెద్ద కంపెనీలు మాత్రమే కాదు, స్టార్టప్‌లు కూడా విద్యార్థులను ఇంటర్న్‌లుగా తీసుకుంటున్నాయి. స్టార్టప్‌లలో పనిచేయడం ద్వారా విద్యార్థులు "చిన్న బృందంలో పెద్ద బాధ్యత" అనే అనుభవాన్ని పొందుతారు. ఇది భవిష్యత్‌లో విదేశీ విశ్వవిద్యాలయాలకు అప్లై చేసే సమయంలో చాలా విలువైనదిగా మారుతుంది.

ఇంటర్న్‌షిప్‌లు మరియు వాలంటీరింగ్ ప్రారంభించడానికి విద్యార్థులు ముందుగా తమ ఆసక్తి రంగాన్ని గుర్తించాలి. ఆ తర్వాత చిన్న చిన్న అవకాశాలను వెతుకుతూ ముందుకు సాగాలి. పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ సంస్థలు, ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లు.. ప్రతిచోట అవకాశాలు ఉన్నాయి. "మొదటి అడుగువేస్తేనే ప్రయాణం మొదలవుతుంది" అనే సూక్తి ఇక్కడ కూడావర్తిస్తుంది. భారతదేశంలో ఇంటర్న్‌షిప్‌లు పొందడానికి ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా ప్రయోగశాలలు, ప్రైవేట్ కంపెనీలు, స్టార్టప్‌లు, ఎన్జీఓలు ప్రతిచోట విద్యార్థులకు అవకాశాలుఉన్నాయి. ఉదాహరణకు, DRDO, ISRO, IISc, IITలు వంటి సంస్థలు వేసవి ఇంటర్న్‌షిప్‌లు అందిస్తాయి. ఇవి అత్యంత పోటీతో కూడినవైనా, ఎంపికైన విద్యార్థులకు జీవితాన్ని మార్చే అనుభవాన్ని ఇస్తాయి. అలాగే TCS, Infosys, Wipro, HCL వంటి పెద్ద కంపెనీలు కూడా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తాయి. సామాజిక రంగంలో పనిచేయాలనుకునే విద్యార్థులకు Teach for India, Akshaya Patra, Goonj, CRY వంటి సంస్థలు సేవా కార్యక్రమాలు మరియు

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇస్తాయి. ఈ సంస్థల్లో పనిచేయడం ద్వారా విద్యార్థులు సమాజాన్ని అర్థం చేసుకుంటారు, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తారు, మరియు "సేవే పరమ ధర్మం" అనే భావనను అనుభవిస్తారు. విదేశాల్లో ఇంటర్న్‌షిప్‌లు పొందడం భారతీయ విద్యార్థులకు ఒక పెద్ద అవకాశంగా మారింది. అమెరికాలో STEM OPT, CPT వంటి ప్రోగ్రామ్‌లు విద్యార్థులకు చదువుతో పాటు పని చేసే అవకాశం ఇస్తాయి. అయితే, భారతదేశంలో చదువుతున్న విద్యార్థులు కూడా విదేశీ ఇంటర్న్‌షిప్‌లు పొందగలరు. అనేక అంతర్జాతీయ సంస్థలు రిమోట్ ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నాయి. ఉదాహరణకు, UN Volunteers, UNICEF, WHO, World Bank వంటి సంస్థలు రిమోట్ ఇంటర్న్‌షిప్‌లు మరియు వాలంటీరింగ్ అవకాశాలు ఇస్తాయి. యూరప్‌లో Erasmus+ వంటి ప్రోగ్రామ్‌లు విద్యార్థులకు పరిశోధన మరియు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇస్తాయి. జర్మనీ, నెదర్లాండ్స్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో పరిశోధనా ప్రయోగశాలలు భారతీయ విద్యార్థులను వేసవి ఇంటర్న్‌లుగా తీసుకుంటాయి.

వాలంటీరింగ్ అనేది కేవలం సేవ కాదు; అది వ్యక్తిత్వాన్ని నిర్మించే ప్రక్రియ. విద్యార్థి జీవితంలో వాలంటీరింగ్ చేస్తే నాయకత్వం, కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలు సహజంగా పెరుగుతాయి. "ఇతరుల కోసం చేసిన పని మనసును శుద్ధి చేస్తుంది" అనే సూక్తి వాలంటీరింగ్‌కు అచ్చం సరిపోతుంది. భారతదేశంలో వాలంటీరింగ్ అవకాశాలు విస్తారంగా ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు, దేవాలయాలు, ఎన్జీఓలు, కమ్యూనిటీ సెంటర్లు..ప్రతిచోట విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు. ఉదాహరణకు, గ్రామాల్లో విద్యార్థులకు బోధించడం, పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనడం, రక్తదానం శిబిరాలు నిర్వహించడం, వృద్ధాశ్రమాల్లో సేవ చేయడం–ఇవి విద్యార్థి జీవితాన్ని మార్చే అనుభవాలు. విదేశాల్లో కూడా వాలంటీరింగ్ అవకాశాలు విస్తారంగా ఉన్నాయి. UN Volunteers, Red Cross, Habitat for Humanity, WWF వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా వాలంటీరింగ్ అవకాశాలు ఇస్తాయి. రిమోట్ వాలంటీరింగ్ కూడా ఇప్పుడు సాధారణమైంది. విద్యార్థులు తమ ఇంట్లో నుంచే ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనగలరు. విదేశీ విశ్వవిద్యాలయాలు విద్యార్థుల ప్రొఫైల్‌ను పరిశీలించే సమయంలో ఇంటర్న్‌షిప్‌లు మరియు వాలంటీరింగ్ అనుభవాలను అత్యంత ప్రాముఖ్యంగా చూస్తాయి. మంచి మార్కులు అవసరం, కానీ అనుభవం మరింత అవసరం. "జ్ఞానం ఉన్నవారు గౌరవం పొందుతారు, అనుభవం ఉన్నవారు అవకాశాలు పొందుతారు" అనే సూక్తి ఇక్కడ వర్తిస్తుంది. భారతీయ విద్యార్థులు కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తే ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడం సులభమవుతుంది. ఇంటర్న్‌షిప్‌లు మరియు వాలంటీరింగ్ విద్యార్థి జీవితాన్ని మార్చగల రెండు శక్తివంతమైన మార్గాలు. ఇవి విద్యార్థికి జ్ఞానం, అనుభవం, వ్యక్తిత్వం, నాయకత్వం, మరియు ప్రపంచ దృష్టి ఇస్తాయి. భారతీయ విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే ప్రపంచం వారి కోసం తెరుచుకుంటుంది. "అవకాశం వచ్చినప్పుడు సిద్ధంగా ఉండటం విజయానికి మొదటి అడుగు" అనే సూక్తి ఈ వ్యాసానికి సరైన ముగింపు.



**వచ్చే వారం:** విలువను సృష్టించే ఆన్‌లైన్ విద్య : విద్యార్థి భవిష్యత్‌కు ఉపయోగపడే కోర్సులు

E-mail: reddyu@gmail.com

# నిత్యాన్నదానానికి.. లక్ష విరాళం



జొన్నవాడ ఆలయ సిబ్బందికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

నెల్లూరు వాస్తవ్యులు తెలిదేవులపల్లి పాండురంగయ్య– వెంకట లక్ష్మమ్మ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఇటీవల జొన్నవాడలో ఉన్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో శాశ్వత నిత్యాన్నదానానికి లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డిల సూచనలతో, ఆలయ అధికారులు దాత గోత్రనామాలతో ఆలయంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారికి, శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు కీలుకుప్ప శ్రీనివాసులు పాల్గొన్నారు.

**ట్రాక్టర్ ట్రక్కు వితరణ :**

సాల్మానుపరం గ్రామానికి చెందిన సగిలి చంద్రశేఖర్‌రెడ్డి–పద్మావతి దంపతులు ఈనెల1న సుమారు లక్షా 50వేల రూపాయల విలువచేసే ట్రాక్టర్ ట్రక్కును అమ్మవారి దేవస్థానానికి తమ వితరణగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు వారికి దేవాలయంలో ప్రత్యేకపూజలు చేయించి, స్వామి–అమ్మవార్ల శేషవస్త్రం బహుకరించారు.

# బుచ్చిరెడ్డిపాలెంలో.. 8న జగన్నాథ రథయాత్ర

**-- జయప్రదం చేయాలని ఇస్కాన్ అధ్యక్షులు శుకదేవస్వామి విజ్ఞప్తి --**

నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఈనెల 8న అత్యంత వైభవంగా జగన్నాథ రథయాత్ర జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథయాత్రను జయప్రదం చేయాలని నెల్లూరులోని ఇస్కాన్ మందిరం అధ్యక్షులు శ్రీ శుకదేవస్వామి ఈనెల 2న ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బుచ్చిలో మొట్టమొదటిసారిగా ఈ యాత్రను నిర్వహిస్తున్నామని, రథయాత్రం ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. రథయాత్ర వల్ల సమాజంలో భక్తిభావం పెంపొందుతుందని, ఎంతో గొప్పదైన హిందూ ధర్మాన్ని, మన సంస్కృతి వైభవాన్ని చాటేందుకు ఇలాంటి దైవకార్యాలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రజలంతా రథయాత్రలో భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆ జగన్నాథుని కృపాకటాక్షలను పొందాలని ఆయన కోరారు.

## డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం కావాలి

మత్తు, మాదకద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజమే అందరి ధ్యేయం కావాలని ఆర్ఐఓ ప్రసాద్‌రావు చెప్పారు. నెల్లూరులోని డీకే డబ్ల్యు కాలేజీలో ఈనెల 2న 'నషాముక్త యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప అభియాన్' పేరుతో నిర్వహించిన కార్యక్రమం గురించి ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ ఈ లైవ్ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజం నిర్మించుకోవాలని, అందుకు నూరు ఆదివారాల కార్యక్రమాలకి పిలుపునిచ్చారని తెలిపారు. మాదకద్రవ్యాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయని, డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటుపడాలని కోరారు. ప్రిన్సిపాల్ డా.ఎం.రమణారెడ్డి, సెట్నెల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, వి.రవిచంద్ర, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.భారతి, డా.బి.ప్రసన్న, డి.శివయ్య, సిహెచ్ కృష్ణతులసి, ఎస్ రమాదేవి, పి.పూర్ణచంద్రకుమారి పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో.. ఉపాధ్యాయులకు ఉద్యోగాలు

నెల్లూరు సమీపంలోని కొత్తూరు వద్దనున్న కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ దొరసానమ్మ ఈనెల 2న ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ హిందీ, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, టీజీటీ మ్యాథ్స్, పీఆర్‌టీ స్పెషల్ ఎడ్యుకేషన్, కౌన్సిలర్ పోస్టులకు ఈనెల 10వ తేదీ ఉదయం 8.30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలని ఆమె కోరారు.

# వెంకటేశ్వరపురం.. వేంకటేశ్వరాలయంలో విశేష పూజలు

**● ఆకట్టుకున్న అవధాని కోట రాజశేఖర్ ప్రవచనం**



సత్కారాన్నందుకుంటున్న అవధాని కోట రాజశేఖర్

నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈనెల 1 నుంచి విశేష పూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. గత 40 ఏళ్లుగా ఈ ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది తొలి ఏకాదశి పర్వదినం నుంచి స్వామివారికి మరిన్ని సేవలు చేసేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. భక్తుల సహాయంతో ఈ కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈనెల 1వ తేదీ సాయంత్రం ప్రముఖ అవధాని, వాల్మీకి రామాయణం ఆడియోకర్త కోట రాజశేఖర్ పాల్గొని, భాగవతంలోని 'రుక్మిణీ కల్యాణం' ఘట్టాన్ని అద్భుతం ఆసక్తికరంగా వివరించారు. ప్రత్యేకించి మహాకవి పోతన రచించిన పద్యాలను అవధాని రాగయుక్తంగా గానం చేయడం భక్తులందరినీ బాగా ఆకట్టుకుంది. ఆ పద్య గానాలకు వెంపులూరు శీనయ్య (ఆర్టీసీ) కీబోర్డు సహకారం అందించారు. అనంతరం అర్చకులు ఏ.సాయిభరద్వాజ్, ఆలయ కమిటీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, ఆలయ ఛైర్మెన్ కోదండరామయ్య తదితరులు అవధాని కోట రాజశేఖర్‌ని సన్మానించారు.

# పాటల కోయిలమ్మ..జానకమ్మకు స్వర నివాళి



జానకమ్మ పాటలను పాడుతున్న గాయనీగాయకులు

నెల్లూరులోని సృజన సంస్థ నిర్వాహకులు దగ్గుబాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 2న పాటల కోయిలమ్మ జానకమ్మకి గాయనీ గాయకులు స్వర నివాళి అర్పించారు. తన గాత్ర మాధుర్యంతో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సంగీతప్రియులను, అశేష ప్రేక్షక జనావళిని అలరించిన జానకమ్మకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వాస్తు, జ్యోతిషశాస్త్ర పండితులు శ్రీ వాసుస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయనీ గాయకులు జానకమ్మ పాడిన పాటలను మధురంగా గానం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. స్థానిక ప్రముఖులు సమాధి సతీష్ కుమార్, నెల్లూరు సుజాతారెడ్డి, తోట శోభారాణి, సింగంశెట్టి మురళీమోహన్, డాక్టర్ కూరపాటి శ్యామ్‌ధన్, సురభి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో..మనమే ఫస్ట్!

## • టీడీపీ నాయకుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తెలుపుతున్న రాజగోపాల్‌రెడ్డి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎన్నో పథకాలను అందజేస్తోందని, సంక్షేమ పథకాల అమలులో మన ప్రభుత్వం దేశంలోనే నెంబర్ 1గా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. వెంకటాచలం మండలం గుద్దూరువారిపాళెంలో ఇటీవల నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం'లో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. అదేవిధంగా, సర్వేపల్లి నియోజకవర్గంలో తమ తండ్రి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేస్తున్న అనేక అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ హైస్కూలును సందర్శించి, విద్యార్థులతో సమస్యలపై ఆరా తీశారు. స్కూల్ గ్రౌండ్‌ని అభివృద్ధి చేయడంతో పాటు క్రీడా వసతులు కూడా కల్పిస్తామని విద్యార్థులకు తెలిపారు.

# ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తులు పంపండి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2026–27 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం అభ్యర్థుల నుంచి రెండవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి ఈనెల 1న ఒక ప్రకటనలో తెలిపారు. 'ఐటీఐ అడ్మిషన్స్ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు తాము చేరదలచుకున్న ఐటీఐని ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ప్రత్యేక గుర్తింపు కలిగిన రిజిస్టర్ కాపీని ప్రింట్ తీసి భద్రపరచుకోవాలని సూచించారు. ఈనెల 11న సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అభ్యర్థులకు ప్రభుత్వ ఐటీఐలలో చేరేవారికి 12వ తేదీన, ప్రైవేట్ అభ్యర్థులకు 14వ తేదీన కౌన్సిలింగ్ ఉంటుందన్నారు.


వాకథాన్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

## బిడ్డకు..
# తల్లిపాలే తొలి టీకా!

బిడ్డకు తల్లిపాలే తొలి టీకా అని నెల్లూరు నగర మేయర్ సుజాత, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 1న తల్లిపాల విశిష్టతపై నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి తన బిడ్డకు పాలివ్వడం ద్వారా ఎన్నోరకాల పోషకాలు, ఇతరత్రా ప్రయోజనాలు బిడ్డకు అందుతాయన్నారు. మొదటి ఆరునెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత రెండేళ్లపాటు తల్లిపాలతో పాటు పోషకాహారం అందించాలని చెప్పారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ చీఫ్ ఆపరేటింగ్ అధికారిణి రోహిణి ప్రియలక్ష్మి, రీజనల్ సీఓఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌సాయి రూప, డాక్టర్ రేఖారెడ్డి, డాక్టర్ మంజూష, డాక్టర్ భార్గవి, ఏసీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం


నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బికెఆర్ కళాశాల సిబ్బంది

విద్యాదాత దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి పేద విద్యార్థులకు, విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. ఈనెల 3న బాలకృష్ణారెడ్డి 48వ వర్ధంతిని పురస్కరించుకుని కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ప్రిన్సిపాల్ డా.ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని బాలకృష్ణారెడ్డి సేవలను స్మరించుకున్నారు. ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ, వేలాదిమంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్య నందించిన బాలకృష్ణారెడ్డిని అప్పట్లో కేంద్రప్రభుత్వం గుర్తించి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందించిందని తెలిపారు. బాలకృష్ణారెడ్డి ఆశయాల బాటలో నడుస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కళాశాల దినదిన ప్రవర్ధమాన మవుతోందని చెప్పారు. ఎన్‌బీకేఆర్ అడ్మిన్ ఇన్‌చార్జి డా. సీహెచ్ రవీంద్రరెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్వాతంత్య్ర వేడుకలకు.. ఎన్‌బికెఆర్ విద్యార్థిని


మానసని అభినందిస్తున్న శ్రీనివాసులు

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్మీ విభాగంలో ఎన్‌సిసి క్యాడెట్ పి.మానస, అమరావతిలో ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మానసను ప్రిన్సిపాల్ అభినందించారు. ఎన్‌సిసి అధికారి లెఫ్ట్‌నెంట్ గోవిందు మాధవయ్య మరియు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

# చెరువుల మరమ్మత్తుకి.. నిధులు రెడీ

## ఎమ్మెల్యే పాశిం సునీల్


చెరువు మరమ్మత్తు పనులకి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు పట్టణంలోని విష్ణ్వేశ్వరపురం వద్ద చెరువు పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. చెరువును పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు చెరువు మరమ్మత్తు పనులకు కోటి 40 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని, అలాగే చెన్నూరు చిల్లకూరు చెరువు మరమ్మతు పనులకు కూడా నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. అమృత్ పథకం కింద గూడూరు పురపాలక సంఘానికి 75 కోట్ల 32 లక్షలు మంజూరయ్యాయని.. దీని ద్వారా పలు అభివృద్ధి పనులు పూర్తిచేయడం జరుగుతుందని వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, లక్ష్మీప్రసన్న, కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


గూడూరు ఎలక్ట్రానిక్ మీడియా వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గూడూరు రూరల్ సి.ఐ కిషోర్‌బాబుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 3న నెల్లూరుజిల్లా ఎస్పీ అజిత వేజెండ్లను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న గూడూరు ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు

# వాహన పత్రాలు తప్పనిసరి


వాహనాలను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శాంతి

వాహనాలకి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శాంతి వాహనదారులని కోరారు. ఇటీవల ఆమె కోట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ వాహనాల నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

# రోటరీ క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు

క్రీడా రంగంలో యువత రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం దరిచేరుతుందని పురపాలక సంఘం కమిషనర్ మల్లికార్జునరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి మెమోరియల్ అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈనెల 4న గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. రొటేరియన్లు కె.మునిగిరీష్, మస్తానయ్య, సునీల్‌కుమార్, బాలకృష్ణంరాజు, నాగేంద్రప్రసాద్, శ్రీధర్, పి.హరిప్రసాద్, టి.వెంకటసురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నాయకులు

# డీఎస్సీలో అక్రమాల నిగ్గు తేల్చాలి

డీఎస్సీ స్కాం బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ... గూడూరు పట్టణంలోని పి.వి.ఆర్ కల్యాణ మండపంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య అధ్వర్యంలో ఇటీవల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. డీఎస్సీలో జరిగిన అవకతవకల కారణంగా యువత పెద్దఎత్తున నష్టపోయిందని, డీఎస్సీ స్కాంకు బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని కాకాణి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అవకతవలపై సి.బి.ఐ దర్యాప్తు చేపట్టాలన్నారు. సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు యద్దల నరేంద్రరెడ్డి, కోడూరు కల్పలత, నాశిన నాగులు, మీరారెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి, బత్తిని విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూం మొహిద్దీన్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకి నిత్యావసర వస్తువుల పంపిణీ

గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ & ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో విజయ దాతృత్వంతో ఈ నెల 5న 37 మంది పేద వికలాంగులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఇన్నర్ ప్రెసిడెంట్ నిర్మల, ఎడిటర్ పవిత్ర, విష్ణు వందన, స్నేహలత, పరంజ్యోతి, ప్రభావతి, సుప్రజ, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు శ్రీనివాస్ ఆచారి, జమీర్ పాల్గొన్నారు.

# ‘విద్య-వసతి-వికాసం’లో దాతలు భాగస్వాములు కావాలి



కలెక్టర్ హిమాన్షు శుక్ల

ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లాలో వినూత్నంగా చేపట్టిన విద్య.. వసతి.. వికాసం కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా తమ భాగస్వామ్యాన్ని పంచుకోవచ్చని, విద్యార్థులకు అవసరమైన వసతులు, సామాగ్రిని హాస్టళ్లకు సమకూర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. దాతలు అందించిన సామాగ్రి, పరికరాలపై వారి పేరును చిరస్థాయిగా నిలిచేలా పొందుపరుస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 155 ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు రెండు నెలల ముందు నుంచే విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కసరత్తు చేపట్టినట్లు వివరించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యారంగంలో పలు సంస్కరణలు అమలవుతున్నాయని, అదే స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## లంబోదర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

# వినాయక చవితికి భారీ ఏర్పాట్లు



విలేకరులతో మాట్లాడుతున్న లంబోదర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

వినాయకచవితిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యేకించి లంబోదర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే వేడుకలకు సంబంధించి, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు నూకరాజు మదన్‌మోహన్‌రెడ్డి ఈనెల 5న లంబోదర సెంటర్‌లో ఆ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. సెప్టెంబరు 14 నుంచి 18వ తేదీ వరకు చవితి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించనున్నామని, ఈసారి శరభ వాహన-గండభేరుండ వినాయక అవతారంలో ఉన్న స్వామివారికి ఉత్సవాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందని చెప్పారు. ఆ విగ్రహాన్ని పర్యావరణ హితంగా మట్టి, గడ్డితో రూపొందిస్తున్నామని, 14వ తేదీ ఉదయం విగ్రహప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు విద్యా గణపతి పూజ (విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, పెన్నులు అందజేసే కార్యక్రమం) ఉంటుందని తెలిపారు. నిరంతరం ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. సెప్టెంబరు 17న లంబోదర గణేష్ లడ్డు వేలం పాట జరుగుతుందన్నారు. 50 మందితో ప్రారంభమైన ఈ కమిటీ, తమిళనాడులోని తంజావూరు సెట్టింగ్‌ను పోలిన అద్భుతమైన సెట్టింగ్‌తో నెల్లూరులో ఉత్సవాలు నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందని ఆయన గుర్తుచేశారు. గత రెండు సంవత్సరాలుగా అన్ని విధాల లంబోదర కమిటీకి సహకారం అందిస్తున్న రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలకు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 18 నుంచి..భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

- 21న గజవాహనసేవ, 23న గరుడసేవ, 24న ఆరాధన



‘ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా!.. ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా!’.. అంటూ మానవాళికి మానవీయమైన బోధనలు చేసిన అవధూత.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 44వ ఆరాధనా మహోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడి గ్రామంలోని వెంకయ్యస్వామి ఆలయంలో జరిగే ఈ ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు కనుక, వారికెలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాల రోజుల్లో ప్రతినిత్యం స్వామివారికి విశేష పూజలు జరుగనున్నాయి. వెంకయ్యస్వామి వారు అవధూత కనుక.. దత్త సంప్రదాయ రీతుల్లో షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. వేకువన 2 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేక సేవలు ఉంటాయి. ఉదయం 10 గంటలకు, రాత్రి 9గంటలకు వాహనసేవల అనంతరం, రాత్రి 11 గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తారు.

**నేత్రపర్వంగా వాహనసేవలు :**

స్వామివారి ఆరాధనోత్సవాల్లో వాహనసేవలు నేత్రపర్వంగా ఉంటాయి. ఈనెల 18న మంగళవారం ఉదయం 10 గంటలకు గొలగమూడి గ్రామస్తుల ఉభయకర్తృత్వంలో స్వామివారికి సర్వభూపాల వాహనసేవ, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహనసేవ నిర్వహించనున్నారు. అదేవిధంగా, 19న ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవలు ఉంటాయి. 20న ఉదయం వృషభ వాహనసేవ, రాత్రికి హంస వాహనం, 21న చినశేషవాహనసేవ, రాత్రికి గజవాహనసేవ, 22న ఉదయం అశ్వవాహనం, రాత్రికి పెదశేషవాహనసేవ, 23న ఉదయం సింహవాహనసేవ, రాత్రి 9 గంటలకు గరుడవాహన సేవలను నిర్వహిస్తారు.

**24న ఆరాధన మహోత్సవం :**

ఈ ఉత్సవాల్లో ప్రధానమైన ‘ఆరాధన మహోత్సవం’ ఈనెల 24వ తేదీ సోమవారం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఆరోజున ఉదయం 9 గంటలకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు వెంకయ్యస్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అనంతరం, ఉదయం 10 గంటలకు రథోత్సవం రమణీయంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 8గంటల నుంచి తెప్పోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తి పాటలు, కీర్తనలు, డోలు-నాదస్వర సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, పౌరాణిక నాటక ప్రదర్శనలతో పాటు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ నెల్లూరుశాఖ వారి కోలాటం-భజన కార్యక్రమాలు ఉంటాయి. స్వామివారి ఆరాధనోత్సవ వేడుకలు ఆద్యంతం అత్యంత వేడుకగా నిర్వహించేందుకు ఆశ్రమ కమిటీ వారు భారీ సన్నాహాలు చేస్తున్నారు.

## ‘జయభారత్’ ఆసుపత్రి మేనేజర్

# గురుప్రసాద్‌కి డాక్టరేట్



నెల్లూరులో సింహపురి వైద్య సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘జయభారత్’ ఆసుపత్రి మేనేజర్‌గా పనిచేస్తున్న మారెళ్ళ గురుప్రసాద్‌కి ఇటీవల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రకటించారు. ‘ఆంధ్రప్రదేశ్ యానాదుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించడం విశేషం. ఈ పరిశోధనకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంత్రోపాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.పద్మజ పర్యవేక్షకురాలిగా వ్యవహరించారని గురుప్రసాద్ తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా జయభారత్ హాస్పిటల్ కేంద్రంగా నెల్లూరులోని యానాదులకు విద్య, వైద్యం,ఆరోగ్యం మొదలైన రంగాలలో అభివృద్ధికి గురుప్రసాద్ కీలకపాత్ర వహిస్తూ, సింహపురి వైద్య సేవాసమితి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జయభారత్ ఆసుపత్రి సిబ్బంది, సింహపురి వైద్య సేవాసమితి నిర్వాహకులు ఆయనని అభినందించారు.

# అంగరంగ వైభవం.. సాయిబాబా నగరోత్సవం



నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్దనున్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో జరుగుతున్న గురుపూర్ణిమ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 5వతేదీ రాత్రి సాయినాథుని నగరోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయిబాబాని విశేష పుష్పాలంకరణలతో శోభాయమానం చేసి, నగరోత్సవం నిర్వహించారు. సాయి నామస్మరణలతో స్వామివారి ఊరేగింపులో భక్తజనం వేలాదిగా పాల్గొన్నారు. కోలాటం-భజనలతో నగరోత్సవం సందడిగా సాగింది. సాయిబాబా మందిరం నుంచి గాంధీబొమ్మ మీదుగా ట్రంకురోడ్డు, ఏసీ సెంటర్, సంతపేట, చిన్నబజారు, పెద్దబజారు, బారకాసు కూడలి, విఆర్‌కాలేజీ సెంటర్‌ల మీదుగా మందిరానికి చేరుకుంది. సాయిబాబా మందిరం కమిటీ కార్యవర్గ సభ్యులు మన్నెం అమరనాథరెడ్డి, పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యాం సుందరరెడ్డి, దువ్వూరి జయమ్మల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## శ్రీసిటీ ఐసాన్ పరిశ్రమ సహకారంతో..


# మన్నారుపోలూరు బడికి.. 42 లక్షలతో వసతులు




ఆర్.ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న ఐసాన్ పరిశ్రమ యాజమాన్యం

శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీకి చెందిన ఐసాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తమ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈనెల 6న సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రారంభించింది. సుమారు రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, ఆర్వో తాగునీటి ప్లాంట్, సేఫ్టీగ్రిల్స్, ఫర్నిచర్ ఏర్పాటు, పాఠశాల ప్రాంగణంలో పచ్చదనం పెంపు వంటి పనులు చేపట్టారు. ఐసాన్ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ యసునోరి సకాయే, ప్లాంట్ హెడ్ యుయిచా టోమిటా, శ్రీసిటీ ఫౌండేషన్ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ పాల్గొన్నారు. ఐసాన్ సీఎస్ఆర్ సేవలను నిరీషా సన్నారెడ్డి అభినందించారు.

# జొన్నవాడ దేవాలయానికి..47.01లక్షల ఆదాయం



జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో సోమవారం హుండీలు లెక్కింపు కార్యక్రమం జరిగింది. మే 18 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు..ఈ 78 రోజులకు ప్రధాన ఆలయ హుండీల ద్వారా రూ.47,01,330 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. యూఎస్ డాలర్లు 20, చైనా యువాన్లు 10, నేపాల్ రూపాయిలు 10, బంగారు వస్తువులు 90 గ్రాములు, వెండి వస్తువులు 191 గ్రాములు వచ్చాయని తెలిపారు. అన్నప్రసాద హుండీ ద్వారా రూ. 2,33,771 లభించాయని ఆయన వివరించారు.



# పోరాటవీరుడు.. పముజుల దశయ్య

## నివాళులర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

సీపీఐ సీనియర్ నాయకులు, దివంగత నేత పముజుల దశరథరామయ్య పట్టువదలని పోరాటవీరుడని పలువురు నాయకులు ప్రస్తుతించారు. ఈనెల 5న నెల్లూరురూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో పముజుల సంతాప సభ జరిగింది. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు మూలం రమేష్, సీపీఐ నాయకుడు రామరాజు తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ, దశన్నతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. కనుపూరు కాలువను తీర్చిదిద్దడంలో దశన్న కీలకపాత్ర పోషించారన్నారు. 60 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన కనుపూరు కాలువ పూడిపోయి రైతులు ఇబ్బందిపడుతున్న తరుణంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలో దానికి జీవం పోసిన మహానాయకుడు దశన్న అని కొనియాడారు. సౌత్ మోపూరులో హైస్కూలు, జూనియర్ కళాశాల అభివృద్ధిలోనూ దశన్నదే ముఖ్యపాత్ర అని, ప్రభుత్వ భూములకు సంబంధించి పేదలకు పట్టాలు ఇప్పించే విషయం లోనూ అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. ప్రజలకు సంబంధించి ఏ సమస్య చేపట్టినా పరిష్కార మార్గం దొరికేవరకు ఆయన వదిలిపెట్టేవారు కాదన్నారు. సారా వ్యతిరేకోద్యమంలో ఆయన పాత్ర కీలకమన్నారు. సారా వేలం పాటలను అడ్డుకోవడంలో సమష్టిగా పనిచేసి విజయవంతమయ్యామని, అది చరిత్రలో నిలిచిపోయిన ఉద్యమమని సోమిరెడ్డి ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకున్నారు. దశన్న లేని లోటు తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని పలువురు సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా సాగునీటి నిర్వహణ

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల, పక్కన ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, కాకర్ల

సాగునీటి నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని, కావలి కాలువ రైతాంగానికి సాగునీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా నీటి నిర్వహణ చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఈనెల 3న జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. కావలి కాలువలో నీటి నిర్వహణ, 12వ కిలోమీటరు వద్ద దెబ్బతిన్న సైఫన్, చివరి ఆయకట్టు వరకు సాగునీటి సరఫరాపై విస్తృతంగా చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కావలి నియోజకవర్గంలో ఏ ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకుండా రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కావలి చెరువును నింపడంతో పాటు చెరువు కింద ఆయకట్టు, ఎన్‌విపీఎం పరిధిలోని రైతులకు కూడా సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రైతులు అపోహలకు గురికాకుండా పరస్పర సహకారంతో వ్యవహరిస్తే ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని పేర్కొన్నారు. సోమశిలలో నీటి లభ్యత ఉందని, శ్రీశైలం నుంచి కూడా నీటి ప్రవాహం కొనసాగుతోందని, త్వరలో మరింత నీరు చేరుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, కావలి కాలువ 12వ కిలోమీటరు వద్ద దెబ్బతిన్న సైఫన్‌ను స్వయంగా పరిశీలించామని, దీని కారణంగా చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనధికార మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసి చివరివరకు సాగునీరు అందించేలా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

# ఎంఎస్ఎంఇ బిల్లుకు టీడీపీ మద్దతు

## - రాజ్యసభలో ఎంపీ బీద మస్తాన్‌రావు -



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు–2026కు తెలుగుదేశం పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు డా. బీద మస్తాన్ రావు యాదవ్ ఈనెల 3న రాజ్యసభలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఆర్థికవ్యవస్థకు ఎంఎస్ఎంఈ రంగం వెన్నెముక వంటిదని, దేశ జీడీపీలో 31శాతం, తయారీ రంగంలో 35 శాతం, ఎగుమతుల్లో దాదాపు 49 శాతం వాటాతో పాటు సుమారు 39 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ బిల్లు కీలక అడుగని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి చౌకైన రుణాల లభ్యత అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, జాతీయీకరించిన బ్యాంకుల రుణ విధానాలను సరళీకృతం చేసి, కొలాటరల్-ఫ్రీ రుణాలను విస్తరించాలని, రుణాల మంజూరును వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. వ్యాపార సౌలభ్యానికి సంబంధించిన సమస్యలకు ఈ సవరణ బిల్లు సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుందని, "వికసిత్ భారత్" లక్ష్య సాధనలో బిల్లు కీలక పాత్ర పోషిస్తుందని బీఎంఆర్ తెలిపారు.

### దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం సహకారం

నెల్లూరు జిల్లా దగదర్తిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) తెలిపారు. ఈనెల 3న రాజ్యసభలో బీఎంఆర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 2016లో దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ఎయిర్‌పోర్ట్స్ పాలసీ ప్రకారం విమానాశ్రయ నిర్మాణ బాధ్యత సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రాజెక్టు అభివృద్ధి సంస్థదేనని, భూసేకరణ, చట్టబద్ధ అనుమతులు, ఆర్థిక ముగింపు వంటి అంశాలపై ప్రాజెక్టు పురోగతి ఆధారపడి ఉంటుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, దగదర్తి విమానాశ్రయం నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి కీలక మౌలిక సదుపాయంగా నిలుస్తుందని, రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, దుగ్గరాజుపట్నం ప్రాంత అభివృద్ధికి ఈ విమానాశ్రయం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి నిర్మాణ పనులను ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారాన్ని కొనసాగించాలని ఆయన కోరారు.

# బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం

తెలుగు నాటక, చలన చిత్ర రంగ కళాకారుడు బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. ఆయన ఆశయాలు, కళా ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈనెల 2న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో నిర్వహించిన బళ్లారి రాఘవ జయంతి వేడుకల్లో పాల్గొని, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగానికి విశిష్ట సేవలందించి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి అస్గర్ అలీ, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిత!

## • ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాసరావు

బాగా చదువుకుంటేనే యువతకు ఉజ్వల భవిత ఉంటుందని, విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, గౌడ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాసరావుగౌడ్ పిలుపునిచ్చారు. ఈనెల2న జిల్లా గౌడ, కల్లుగీత శ్రామికుల సంఘం,గౌడ సేవాసమితి ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం జరిగింది. ఇటీవల టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 160 మంది విద్యార్థులకు 5వేల రూపాయల వంతున నగదు పురస్కారాలను, విద్యాసామగ్రిని అందజేసి అభినందించారు. మహారాష్ట్ర నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అన్నం సుబ్రహ్మణ్యం, డీపీఓ అనుపమ, విశ్రాంత ఏఎస్పీ వాకా రాంబాబు, నారాయణ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ బి.మాధవులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.కుసుమ, ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. వెంకటాచలపతి గౌడ్, ఎన్‌బీకేఆర్ ప్రొఫెసర్ లావణ్య, గౌడసేవాసమితి ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, అధ్యక్షులు ప్రభాకరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...



## అంబాపురంలో తల్లిపాల వారోత్సవాలు

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఈనెల 1న నెల్లూరు రూరల్ మండలంలోని అంబాపురం శ్రీలంక కాలనీలో ప్రజలకు ఐసీడీఎస్ అధికారులు తల్లిపాల ప్రాధాన్యత పట్ల అవగాహన కలిగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు రోగనిరోధకశక్తి పెంపొందుతుందని చెప్పారు.

## సీతారామపురంలో..డ్రగ్స్‌కి వ్యతిరేకంగా అవగాహన

మండల కేంద్రమైన సీతారామపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈనెల 1న మత్తు, మాదకద్రవ్యాల(డ్రగ్స్)కు వ్యతిరేకంగా ఎస్ఐ వెంకట రాజేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. డ్రగ్స్ ఎంతటి వినాశకరమో, జీవితాలను అవి ఎలా నాశనం చేస్తాయో ఆయన విద్యార్థులకు వివరించి, డ్రగ్స్‌కి అందరూ దూరంగా ఉండాలని హెచ్చరించారు.

## అల్లూరు టీడీపీ ఆఫీసులో ప్రజాదర్బార్

మండల కేంద్రమైన అల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 1న ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు చెప్పిన సమస్యల పరిష్కారానికి ఆయన అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో ఫోన్‌లో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## కావలి ఆర్టీసీ బస్టాండ్‌కు వాటర్ మోటార్ వితరణ

కావలి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణీకుల సౌకర్యార్థం స్థానిక దాత చలువాది వెంకటేశ్వర్లు 30వేల రూపాయల విలువచేసే వాటర్ మోటార్‌ను, పైపులను వితరణగా అందజేశారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్, ఏ.ఇ బి.మల్లికార్జున, రవిప్రకాష్ పాల్గొన్నారు.

## కోవూరులో ఆయుష్ వైద్యశిబిరం

కోవూరు తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డేలో నిర్వహిస్తున్న ఆయుష్ వైద్యసేవల్లో భాగంగా ఈనెల 3న హోమియో వైద్యులు కరుణాకర్, ఆయుర్వేద వైద్యులు హేమంత్‌బాబు సంయుక్త ఆధ్వర్యంలో 'ఆయుష్' వైద్యశిబిరం నిర్వహించారు. 70 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

## కల్లూరుపల్లిలో కార్డన్ సర్చ్

నెల్లూరు రూరల్‌లోని కల్లూరుపల్లి ప్రాంతంలో పోలీసులు ఈనెల 3న కార్డన్ సర్చ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణలో భాగంగా ప్రతి ఇంటినీ తనిఖీచేశారు. సరైన పత్రాలు లేని 15 మోటారు వాహనాలను గుర్తించి కేసులు నమోదుచేసి జరిమానాలు విధించారు. రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వేణు, ఎస్ఐల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.

## కండలేరు ఎడమకాలువకు సాగునీరు

పొదలకూరు మండలంలోని పొదలకూరు, చేజర్ల మండలాల్లో నిమ్మ, మామిడి తదితర ఉద్యానపంటల కోసం ఈనెల 4న కండలేరు ఎడమకాలువకు సాగునీటిని విడుదల చేశారు. నీరు లేక ఆ పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండడంతో, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవ తీసుకుని అధికారులకు తెలిపి, సాగునీరు విడుదల చేయించారు.


## వెలుగోడులో 'పొలం పిలుస్తోంది'

రాపూరు మండలం వెలుగోడులో ఈనెల 4న వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ప్రధానమంత్రి పసల్‌బీమా యోజన కింద పేర్లు నమోదుచేసుకుని, కష్టకాలంలో ప్రయోజనం పొందాలని సూచించారు. వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

## గాదెలదిన్నెలో కోడిపందాలు-ఐదుగురు అరెస్ట్

విడవలూరు మండలం గాదెలదిన్నె గ్రామంలో ఇటీవల కోడిపందాల స్థావరంపై ఎస్ఐ సాయి కల్యాణ్ తన సిబ్బందితో దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేసి, వారిపై కేసు నమోదు చేశారు. ఒక కోడిని, 3 ద్విచక్రవాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# దొరికిన వాడు దొంగ - దొరకని వాడు దొర!




## ప్రభుత్వ విభాగాల్లో లంచావతారాలు...
## ఏసీబీ దాడులు చేస్తున్నా మారని వ్యవస్థలు తీరని అవస్థలు

***"లంచం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయంలో పని జరగదు", ఇది ప్రజల నుండి తరచుగా వినిపించే మాట. ఒకప్పుడు వ్యంగ్యంగా చెప్పుకునే ఈ మాట, నేడు అనేకమంది పౌరుల అనుభవంగా మారిందన్న ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది. జనన ధ్రువీకరణ పత్రం నుంచి భూమి పట్టాదారు పాస్‌బుక్ వరకు, భవన నిర్మాణ అనుమతి నుంచి ప్రభుత్వ సంక్షేమపథకాల వరకు, విద్యుత్ కనెక్షన్ నుంచి ఆసుపత్రి సేవల వరకు అనేక సందర్భాల్లో "ఫైలు కదలాలంటే చేయి తడవాలి" అనే అభిప్రాయం బలపడింది. ప్రభుత్వం పారదర్శక పాలన, డిజిటల్ సేవలు, అవినీతి నిరోధక చర్యలను ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ట్రాప్ కేసులు, అక్రమాస్తుల కేసులు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అయినా అన్ని ప్రభుత్వ శాఖలలో లంచాల పర్వం నిరభ్యంతరంగా, నిస్సిగ్గుగా కొనసాగుతూనేవుంది.***

### అవినీతి అంటే కేవలం లంచం కాదు!

అవినీతి అనగానే కేవలం ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకోవడమే మనకి గుర్తుకు వస్తుంది. కానీ ఇది అంతకంటే తీవ్రమయిన సమస్య. అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిధులని దారి మళ్లించడం, టెండర్లలో అక్రమాలు, నియామకాల్లో పక్షపాతం, భూ రికార్డుల మార్పులు, అక్రమ ఆస్తుల కూడబెట్టడం లాంటివన్నీ అవినీతి రూపాలే. ఒక ఉద్యోగి రూ.5,000 లంచం తీసుకుంటే అది కనిపిస్తుంది. కానీ కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు అక్రమాలు బయటపడటం చాలా కష్టం. అందుకే చిన్న ట్రాప్ కేసులు వెలుగులోకి వస్తున్నా, పెద్ద స్థాయి అవినీతిపై ప్రజల్లో అనుమానాలు కొనసాగుతుంటాయి.

### ఎక్కువ ఆరోపణలు ఎదుర్కొనే కొన్ని శాఖలు!

ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లో ఫిర్యాదులు ఎక్కువగా నమోదవుతుంటాయి. వాటిలో కొన్ని రెవెన్యూ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన, రవాణాశాఖ, విద్యుత్ పంపిణీ సంస్థలు, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు సేవలకు సంబంధించిన కొన్ని పరిపాలనా విభాగాలు, సంక్షేమ పథకాల అమలు యంత్రాంగం, ఆర్థిక శాఖ ఇవి కేవలం మచ్చుకి మాత్రమే. దాదాపుగా ప్రభుత్వ విభాగాలలో వున్న అన్ని వ్యవస్థలలోనూ లంచావతారాలు వున్నారు. అలా అని పై జాబితా మొత్తం శాఖలు అవినీతిగ్రస్తమనే అర్థం కాదు. అయితే ప్రజలతో ఎక్కువ సంబంధం ఉన్న చోట ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తాయి.

### ఏసీబీ దాడులు... తర్వాత?

ప్రతి నెలా ఎక్కడో ఒకచోట ట్రాప్ కేసు. ఎక్కడో ఒకచోట అక్రమాస్తుల దర్యాప్తు. లక్షలు, కోట్లు విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వస్తూనే ఉంటాయి. ఇవి ప్రజలకు ఆశ కలిగిస్తాయి. కానీ కొద్ది రోజులకే మరోచోట అదే తరహా ఘటన వెలుగులోకి వస్తుంది. అంటే, వ్యక్తులని పట్టుకోవడం జరుగుతున్నా, వ్యవస్థలోని మూలకారణాలు అలాగే మిగిలిపోతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది.

### శిక్ష పడే వరకు... అవినీతి నిరోధం అసంపూర్ణం!

ఒక ఉద్యోగి ట్రాప్‌లో పట్టుబడటం మొదటి దశ మాత్రమే. కేసు దర్యాప్తు, అభియోగాల నమోదు, కోర్టు విచారణ, తుది తీర్పు, ఈ మొత్తం ప్రక్రియకు అనేక సంవత్సరాలు పట్టడం సర్వ సాధారణం. అలా విచారణ సుదీర్ఘంగా సాగడం వల్ల నిందితుడికి భయం తగ్గిపోవడం, ప్రజల్లో చట్టంపై విశ్వాసం సన్నగిల్లడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అవినీతి నిరోధక చర్యల అసలు ప్రభావం శిక్షల వేగం, ఖచ్చితత్వంపై ఆధారపడి ఉంటుందన్న విషయం ప్రభుత్వాలు సైతం విస్మరిస్తున్నాయి.

### డిజిటలీకరణతో అవినీతి పూర్తిగా పోతుందా?

ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకురావడం వల్ల కొన్ని స్థాయిల్లో ప్రత్యక్ష లావాదేవీలు తగ్గాయి. మీ-సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ దరఖాస్తులు, డిజిటల్ చెల్లింపులు, ఈ-ఆఫీస్ విధానం వంటి చర్యలు పారదర్శకతకు తోడ్పడ్డాయి. అయితే డిజిటల్ వ్యవస్థలలో కూడా ఫైల్ ఆమోదం, సాంకేతిక అభ్యంతరాలు, పరిశీలన వంటి దశల్లో మానవ నిర్ణయాలు అవసరమయ్యే చోట అవినీతి అవకాశాలు పూర్తిగా మాయం కాలేదు.

లంచం అడిగినా అధికారికంగా ఫిర్యాదు చేయడానికి ఎక్కువ శాతం జనం వెనుకాడుతుంటారు. అందుకు కారణాలు పని ఆగిపోతుందనే భయం, తిరిగి వేధింపులకు గురవుతామనే అనుమానం, సాక్ష్యాలు సమకూర్చడం కష్టమని భావించడం, కేసు పూర్తయ్యే వరకు సమయం, శ్రమ అవసరం కావడం. ఈ పరిస్థితుల్లో అవినీతితో విసిగి వేసారిన వారు మాత్రమే అధికారిక ఫిర్యాదు చేస్తారు.

### రాజకీయ సంకల్పం కూడా కీలకం!

అవినీతి నిరోధక సంస్థలు స్వతంత్రంగా పనిచేయడానికి పరిపాలనా మద్దతు అవసరం. దర్యాప్తు సంస్థలకు తగిన సిబ్బంది, ఆధునిక సాంకేతిక వనరులు, ఫోరెన్సిక్ సామర్థ్యం, వేగవంతమైన అభియోగాల ప్రక్రియ ఉంటేనే ఫలితాలు మెరుగుపడతాయి. అలాగే, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే అధికారులపై శాఖా పరమైన చర్యలు కూడా సమయానికి పూర్తి కావాలి. "పని త్వరగా కావాలి" అనే ఆలోచనతో కొందరు స్వచ్ఛందంగా లంచం ఇవ్వడానికి సిద్ధపడతారు. ఈ ధోరణి కూడా అవినీతిని ప్రోత్సహిస్తుంది. లంచం తీసుకునేవారితో పాటు, లంచం ఇచ్చే పరిస్థితులను కూడా తగ్గించడం అవసరం.

ఈ జాడ్యాన్ని కొంతవరకైనా నిర్మూలించడానికి పరిష్కార మార్గాలు కూడా అనేకం వున్నాయి.

ఉదాహరణకు ప్రతి ప్రభుత్వ సేవకు చట్టబద్ధమైన గడువు విధించడం. సేవ ఆలస్యమైతే సంబంధిత అధికారిని బాధ్యుడిని చేయడం. పూర్తి ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థని ఏర్పాటు చేసుకోవడం. ట్రాప్ కేసులపై త్వరితగతిన విచారణ జరిగేలా చూడడం. ప్రత్యేక అవినీతి నిరోధక కోర్టులని బలోపేతం చేయడం. ఫిర్యాదుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగులకు నైతిక పరిపాలనపై నిరంతర శిక్షణ ఇవ్వడం. శాఖల వారీగా పారదర్శక పనితీరు సూచికలని ప్రచురించడం. సామాజిక పర్యవేక్షణ, పౌర భాగస్వామ్యానికి ప్రాధాన్యం కల్పించడం వంటివి కొంతవరకు అవినీతిని, లంచగొండి తనాన్ని తగ్గించగలవనడంలో సందేహం అవసరం లేదు.

అవినీతి అన్నది ఒక్క వ్యక్తి సమస్య కాదు, అది పరిపాలనా వ్యవస్థ, రాజకీయ సంకల్పం, చట్టాల అమలు, సామాజిక ధోరణులు, ఈ నాలుగింటి కలయికతో ఏర్పడే సవాలు. ఒక ఉద్యోగి పట్టుబడితే వార్త అవుతుంది. కానీ ఆ ఘటన తర్వాత అదే కార్యాలయంలో లంచం ఆగితేనే అది విజయంగా చెప్పుకోవచ్చు. ఏసీబీ దాడులు అవసరమే. కానీ అవి ఒక్కటే సరిపోవు. త్వరితగతిన న్యాయం, పారదర్శక సేవలు, కఠినమైన శాఖా పరమైన చర్యలు, సాంకేతిక సంస్కరణలు, ప్రజల భాగస్వామ్యం వంటివి కలిసొచ్చినప్పుడే అవినీతి నిజంగా తగ్గుతుంది. అప్పటి వరకు ప్రజల నోట వినిపించే వ్యంగ్య వాక్యం "దొరికిన వాడు దొంగ... దొరకని వాడు దొర".



## విజయవాడ - బెంగళూరు వందేభారత్
# వెంటనే ప్రారంభించండి
### రైల్వే మంత్రికి లేఖ రాసిన వెంకయ్యనాయుడు



"విజయవాడ - బెంగళూరుల మధ్య వందేభారత్ కోసం వెంకయ్యనాయుడు గారు చొరవ చూపాలి" అంటూ 'లాయర్' ప్రజావాణి ద్వారా బెంగళూరుకు చెందిన హేమంత్ కుమార్‌రెడ్డి గత వారం రాసిన లేఖకి మన వెంకయ్యనాయుడు స్పందించారు. 'లాయర్'లో లేఖ చదివిన వెంటనే ఆయన రైలు వివరాలతో వివిధ ప్రముఖ పత్రికలలో 2025 మే మాసంలో వచ్చిన వార్త ప్రతులని కూడా తెప్పించుకున్నారు. ఆ వెంటనే కేంద్ర రైల్వేమంత్రి అశ్వని వైష్ణవ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడితో వెంకయ్య ఆగలేదు. రైలు వివరాలని వివిధ మాధ్యమాలలో వచ్చిన సమాచారాన్ని జోడిస్తూ కేంద్ర రైల్వేమంత్రికి లేఖ కూడా రాశారు. విజయవాడ నుండి చిత్తూరు వరకు బెంగళూరుకి వెళ్ళడానికి ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు నుండి ఇటు రావాలన్నా, ఇటు నుండి అటు వెళ్ళాలన్నా బస్సులపైన లేదంటే సొంత వాహనాలపైనా ఆధారపడుతున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఇదే సమస్య. రైల్వేశాఖ ప్రకటించిన విజయవాడ - బెంగళూరు వందేభారత్ కొన్ని వేలమంది ప్రయాణికులకి ఊరట కలిగిస్తుంది. సదరు వందేభారత్‌ని సాధ్యమైనంత త్వరలో ప్రారంభించాలంటూ కేంద్ర రైల్వేమంత్రికి వెంకయ్య రాసిన లేఖ యధాతదంగా 'లాయర్' పాఠకులకు అందిస్తున్నాం.

**శ్రీ అశ్విని వైష్ణవ్ గారికి,**

నమస్కారం!

మన మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణకు కొనసాగింపుగా ఈ లేఖ రాస్తున్నాను.

విజయవాడ-బెంగళూరు మధ్య ప్రతిపాదించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (ప్రతిపాదిత రైలు నంబర్లు 20711/20712) గురించి నెల్లూరు మరియు పరిసర జిల్లాలకు చెందిన పలువురు ప్రజలు నాకు తెలియజేశారు. కొంతకాలం క్రితం ఈ రైలు ప్రకటించబడిందని, అప్పట్లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఈ రైలు ఉదయం సుమారు 5:30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు స్టేషన్లలో ఆగుతూ, మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు బెంగళూరుకు చేరుకునేలా ప్రతిపాదించబడిందని తెలిపారు. ఈ ప్రతిపాదన 2025 మే 19న వివిధ వార్తా మాధ్యమాల్లో కూడా విస్తృతంగా ప్రచురితమై, ప్రయాణికుల్లో విశేష ఉత్సాహాన్ని కలిగించింది.

ఈ ప్రతిపాదిత సేవను ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్-కర్ణాటక మధ్య ప్రయాణించే ప్రజలు ఎంతో హర్షించారు. ఈ మార్గంలో వేగవంతమైన, సౌకర్యవంతమైన పగటిపూట రైలు సేవ అవసరమని వారు చాలా కాలంగా భావిస్తున్నారు. ఈ రైలు ప్రారంభంపై ఇప్పటికీ ప్రజల్లో విశేష ఆసక్తి, ఆశాభావం కొనసాగుతున్నాయి.

అందువల్ల, ఈ అంశాన్ని సంబంధిత రైల్వే అధికారుల ద్వారా పునఃసమీక్ష చేయించి, ఈ ప్రతిపాదన యొక్క ప్రస్తుత స్థితిని తెలుసుకొని, సాధ్యమని భావించిన పక్షంలో ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రైలు సేవను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

సాదర శుభాకాంక్షలతో,
భవదీయుడు,
ఎం. వెంకయ్య నాయుడు

విజయవాడ నుండి బెంగళూరు వరకు ప్రయాణించడం కోసం దీర్ఘకాలంగా ప్రజలు పడుతున్న పాట్లు గమనించి భారత పూర్వ ఉపరాష్ట్రపతి.. మన వెంకయ్య నాయుడు స్పందించడం హర్షదాయకం. ఈ వందేభారత్ రైలు త్వరితగతిన ప్రారంభమైతే.. ఆ ఘనత మన వెంకయ్యకే దక్కుతుందనడంలో సందేహం లేదు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com